1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ

బుధవారం | మార్చి 27. 2024 | www.navatelangana.com

ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-చిట్యాలటౌన్

ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళశారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాది కొత్తగూడెం జిల్లాకు చెందిన బాదవత్ రాందాసు (60) ఇటీవల ఆనారోగ్యానికి గురయ్యాడు. దీంతో వైద్య చికిత్సకుగాను హైదరాబాద్ కు ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో తన భార్యతో కలిసి బయల్దేరారు. అనంతరం మార్గమద్యంలో చిట్యాల పట్టణ శివారులోకి రాగానే రాందాసు గుండెనొప్పి వస్తుందని చెప్పాడు. దీంతో పలువురు అతనికి సీపీఆర్ చేసే ప్రయత్నం చేస్తుండగానే బస్సును స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట డ్రైవర్ నిలిపివేశాడు. వైద్య సహాయం కోసం 108 కాల్ చేసి ప్రయత్నిస్తుండాగానే కూర్చున్న సీట్ లోనే రాందాసు మృతి చెందాడు. ఇంతలోనే 108 వైద్య సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకోని రాందాసును పరిక్షించి అప్పటికే మృతి చెందినట్లు దృవీకరించారు. అనంతరం మృతదేహాన్ని ఖమ్మంలోని స్వస్థలానికి మరో వాహనంలో తరలించారు. దీంతో బస్సు సుమారుగా గంటకుపైగా చిట్యాలలోని పోలీస్ స్టేషన్ ఎదుటనే నిలిపివేశారు.


అంజిరెడ్డికి పరామర్శ

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్



గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న తిప్పర్తి మండలం అంతయ్య గూడెం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నన్నూరి అంజిరెడ్డి ని ఆ పార్టీజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం మంగళవారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ వ్యవసాయ రైతు కార్మికుల హక్కుల కోసం అంజిరెడ్డి చేసిన పోరాటాలను, పేద ప్రజల కోసం చేసిన భూ పోరాటం మండలంలో పార్టీ బలోపేతానికి చేసిన కృషి గురించి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి మన్నెం బిక్షం, మండల కమిటీ సభ్యులు భీమగాని గణేష్, దోంగరి వెంకన్న, మైల సైదులు, తౌండోజు శంకరయ్య చారి, బ్రహ్మ చారి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిక దూరం
అభ్యర్థులకు భారం



లోక్ సభ ఎన్నికలు ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఖర్చుతో కూడుకున్న పనిగా మారింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలో మే 13న పోలింగ్ జరగనుంది. పోలింగ్‌కు ఇంకా సుమారు 47 రోజుల సమయం ఉండడంతో అప్పటివరకు కార్యకర్తలను ,క్యాడర్ను మెయిటెన్ చేయడం అభ్యర్థులకు భారంగా మారనుంది .పోలింగ్ పూర్తయ్యే వరకు ఖర్చులు తడిసి మోపెడవుతాయన్న భయం పార్టీ నేతలలో పట్టుకుంది .పార్లమెంట్ ఎన్నికల పోటీ చేయనున్న అభ్యర్థులతో పాటు ఆయా అసెంబ్లీ నియోజక వర్గాలకు ప్రధాన పార్టీల తరపున ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న నేతలకు సైతం అదనపు భారం పడుతుంది. .నియోజకవర్గంలో తమ తమ పార్టీలకు ఆదిక్యత తీసుకొని రావడానికి ఆయా పార్టీల అసెంబ్లీ ఇన్చార్జీలు సైతం క్యాడర్‌ను కాపాడుకోవడానికి తంటాలు పడుతున్నారు.

- పోలింగ్ కు ఇంకా 47 రోజుల సమయం
- కార్యకర్తలను కాపాడుకోవడం పార్టీలు, అభ్యర్థులకు భారమే
- ఖర్చు తడిసి మోపెడవుతుందని భయం
- పార్లమెంటు ఎన్నికలపై రాజకీయ పార్టీల గాబారా

నవతెలంగాణ- దేవరకొండ

ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు లోక్ సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి . నల్లగొండ లోక్ సభ నియోజకవర్గం నుండి పోటీ చేసే ప్రధాన పార్టీల అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించాయి. అధికార పార్టీ కాంగ్రెస్ నుండి సీనియర్ నాయకులు మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తనయుడు రఘువీర్ రెడ్డి, బీజేపీ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి, బీఆర్ఎస్ కంచర్ల కృష్ణారెడ్డిలకు టికెట్ కేటాయించారు. అసెంబ్లీ ఎన్నికలలో ఓటమిపాలై అధికారానికి దూరమైన బీఆర్ఎస్ ఎంపీ ఎన్నికలలో గెలవడం ద్వారా జిల్లాలో పార్టీ ఉనికిని చాటుకోవాలనే ప్రయత్నం చేస్తుంది. దీంతో ముఖ్య నాయకులతో అంతర్గత సమావేశాలు నిర్వహిస్తుంది. వంద రోజుల క్రితమే రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీకి నల్గొండ ఎంపీ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి .నల్గొండ పార్లమెంటు పరిధిలో ఇద్దరు మంత్రులు ,ఐదుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే ఉన్నారు. ఒకవేళ ఎంపీ ఎన్నికలలో ఓడిపోతే ప్రభుత్వం, మంత్రుల ,ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల మీద ప్రభావం పడుతుందని భావిస్తున్న అధికార పార్టీ ఈ ఎన్నికలలో గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమవుతున్నారు. తనయుడు గెలుపు కోసం జానారెడ్డి ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో పాటు ముఖ్య నాయకులతో టచ్ లో ఉంటూ, గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తూ ,మరోవక్క గెలుస్తామనే ధీమాలో ఉన్నారు. కేంద్రంలో మూడవసారి మోదీ సర్కారు నినాదంతో ఎన్నికల బరిలో దిగిన బీజేపీ పార్లమెంటు ఎన్నికలలో ఎలాగైనా నల్లగొండ సీటును కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో ముందుకు సాగుతుంది. నల్గొండను గెలుచుకునేందుకు ప్రధాన పార్టీలు ఎతులపై ఎత్తులు వేస్తున్నారు.

ఓటర్లను ఆకట్టుకోవడం కష్టమే.....

ప్రధాన రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మరోవైపు వివిధ రకాలుగా ఓటర్లను ఆకట్టుకోవడం కూడా అధిక భారంగా మారనుంది .పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, ప్రచారానికి తరలి వచ్చే శ్రేణులకు విందులు, రవాణా సదుపాయాలు వంటివి భరించాల్సి ఉంటుంది. ప్రచార సామగ్రిని సమకూర్చుకోవడం కూడా ఆర్థికంగా భారం కానుంది. ఎన్నికలకు నెలరోజుల వ్యవధి ఉంటే ఆర్థికంగా కొంత తక్కువ భారం పడేది. ఎన్నికలకు ఏప్రిల్ ఎంతో అనుకూలమని భావించారు. కానీ మే 13న ఎన్నికల నిర్వహించడం వల్ల అప్పటివరకు ఎన్నికల ఖర్చుతో పాటు ప్రచారం చేయడం కూడా భారంగా ఉంటుందని ప్రధాన పార్టీలకు చెందిన పలువురు నాయకులు అంటున్నారు.

అభ్యర్థులకు ,పార్టీలకు చుక్కలే...

లోక్ సభ ఎన్నికలకు ఇంకా దాదాపు నెలన్నర సమయం ఉంది. ఈ నెలన్నర రోజులలో ఆయా పార్టీలకు, అభ్యర్థులకు చుక్కలు కనపడతాయని భావిస్తున్నారు .మే 13వ తేదీన ఎన్నికలు జరుగుతుండడంతో ఎన్నికల షెడ్యూల్ కు పోలింగ్ మధ్య సమయం ఎక్కువగా ఉంది. ప్రచార కార్యక్రమాలు ,కార్యకర్తల బాగోగులు అనేది అభ్యర్థులకు తలకు మించిన భారం అవ్వనుంది. నల్గొండ లోక్ సభ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి .ఆయా నియోజకవర్గంలో పార్టీ ముఖ్య నేతలు, ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలకు కావలసిన సౌకర్యాలు అన్ని కల్పించాల్సి ఉంటుంది. చిన్న నిర్లక్ష్యం జరిగిన పార్టీ విడుతామంటూ బెదిరించేవారు ఉంటారు. ఎవరు ఏ రోజు ఏ పార్టీలో చేరుతారో తెలియని పరిస్థితి ఉంటుంది. అభ్యర్థులు ఆయా గ్రామాలకు వెళ్లే క్రమంలో ఖర్చులు కూడా ఎక్కువగానే ఉండనున్నాయి. అభ్యర్థుల రాక కోసం ఆయా గ్రామాల్లో ఎదురుచూస్తున్నారు.

యంత్రాంగానికి సవాలే...

ఎన్నికలకు ఎక్కువ సమయం ఉండడంతో అధికార యంత్రాంగం పైన భారం పడనుంది. అన్ని రోజులు ఎన్నికల కోడ్ ను పర్యవేక్షించడం ఇబ్బందికరంగా ఉంటుంది. షెడ్యూల్ వెలువడిన రోజు నుంచి కోడ్ అమల్లోకి వచ్చింది. ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్ ఉల్లంఘన పై పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడం, వాటిని పరిష్కరించడం అధికారులకు కొంత ఇబ్బందికరంగా మారుతాయని భావిస్తున్నారు.

తాగు నీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు

- జిల్లాలో 370 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- కలెక్టర్ దాసరి హరిచందన

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



గ్రామీణ ప్రాంతాలతో పాటు, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ దాసరి హరిచందన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. జిల్లాలో అవసరమైన చోట చేతి పంపుల మరమ్మతు తో పాటు, టాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతి కుమారి అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులు, మిషన్ భగీరథ, అధికారులతో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, తాగునీటిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ముందుగా ధాన్యం కొనుగోలు పై సమీక్ష సందర్భంగా కలెక్టర్ దాసరి హరిచందన మాట్లాడుతూ యాసంగిలో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 370 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, 5 లక్షలా 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్ కు రావచ్చని అంచనా వేశామని తెలిపారు. టార్పాలిన్లు, ధాన్యాన్ని శుభ్రపరిచే యంత్రాలు, తూకం యంత్రాలు అన్నింటిని సిద్ధం చేశామని, గన్ని బ్యాగులు సిద్ధంగా ఉన్నాయని, ఇతర ప్రాంతాల నుండి జిల్లాకు ధాన్యం రాకుండా సరిహద్దుల వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వానాకాలం కష్టం మిల్లింగ్ రైస్(సి ఎం ఆర్) మిల్లింగ్‌కు సంబంధించి రైస్ మిల్లర్లతో తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచందర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ నాగిరెడ్డి, జెడ్పి సీఈఓ ప్రేమ్కరణ్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, మిషన్ భగీరథ ఎస్ ఈ. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ద్వారా ఎన్నికల అంశాలను పర్యవేక్షించాలి: కలెక్టర్

లోక సభ ఎన్నికల సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీకృత కంట్రోల్ రూమ్ ద్వారా ఎన్నికలకు సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన కంట్రోల్ రూమ్ ఇన్చార్జి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె సమీకృత కంట్రోల్ రూమ్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి బృందాల తనిఖీలను సీసీటీవీ వీడియో ల ద్వారా పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి వచ్చే ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి బృందాలకు వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నది లేనిది పర్యవేక్షించాలన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డిఆర్డిఏ పిడి నాగిరెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇక్బాల్ బేగం కాంప్లెక్స్ సీజ్

నవతెలంగాణ-మిర్యాలగూడ



స్థానిక డాక్టర్స్ కాలనీలోని ఇక్బాల్ బేగం కాంప్లెక్స్‌లోని 9 షాపులు రూ.4.5లక్షలు ఆస్తిపన్ను బకాయిలు ఉండటంతో నోటీసు ఇచ్చి నేడు సీజ్ చేశారు. భారీ బకాయిలున్న వారికి రెడ్ నోటీసులు ఇచ్చిన అనంతరం చెల్లించక పోవడంతో సీజ్ చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ యూసుఫ్ తెలిపారు. బకాయిదారులకు గౌరవంగా నోటీసులు ఇచ్చిన తర్వాతనే సీల్ వేస్తున్నామని తెలిపారు. పన్నులు చెల్లించేందుకు బకాయిదారులు ముందుకు రావాలని, సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ డి. కళ్యాణి, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు రాకేష్, రవీలు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

మీ భవిష్యత్తు బాగుండాలంటే నైతిక ఓటు వేసి మంచి నాయకున్ని ఎన్నుకోండి

- కలెక్టర్ దాసరి హరిచందన



నవతెలంగాణ- నల్లగొండ టౌన్

భవిష్యత్తు బాగుండాలంటే నైతిక ఓటు వేసి మంచి నాయకున్ని ఎన్నుకోవాలని కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం మనదే అని, కుల, మత, లింగభేదం తేడా లేకుండా రాజ్యాంగం అందరికీ సమానంగా ఓటు హక్కును కల్పించిందన్నారు. ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలో నైతిక ఓటింగ్ పై నాగార్జున కళాశాల మైదానం నుండి స్థానిక గడియారం సెంటర్ వరకు నిర్వహించిన 5 కే రన్‌ను జండా ఊపి ప్రారంభించారు.అనంతరం ఆమె స్థానిక గడియారం సెంటర్లో మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఈ ఎన్నికలలో 85 ఏండ్లు నిండిన ఓటర్లకు, వికలాంగ ఓటర్లకు హోం ఓటింగ్ సదుపాయం కల్పించిందని, హోం ఓటింగ్ వేయాలనుకునే ఓటర్లు ఫామ్- 12 డి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, లేదా సాక్ష్యం యాప్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునే అవకాశముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్,జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డీఆర్డిఏ పీడీ నాగిరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు డాక్టర్ పుల్లారావు, డిఎస్‌డిఓ , వివిధ శాఖల అధికారులు విద్యార్థులు, అంగన్వాడీ టీచర్లు, ఆర్పీలు, పంచాయతీ సెక్రెటరీలు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

- కుక్క కాటు వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుకోవాలి
- ఏరియాస్పత్రిని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ -మిర్యాలగూడ

ఆస్పత్రి సిబ్బంది వైద్యులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర ఆదేశించారు. మంగళవారం స్థానిక ఏరియాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్ తెప్పించి చూసి హాజరు పట్టికను పరిశీలించారు. విధులకు హాజరైన సిబ్బంది వైద్యులు హాజరు పట్టికలో సంతకాలు చేయాలని సూచించారు. సంతకాలు పెట్టకుండా ప్రజెంట్ అయినట్టు రాసుకోవడం సరికాదన్నారు. ఆస్పత్రిలో వైద్యుల వివరాలను అడిగి తెలుసుకుని వారితో మాట్లాడారు. కుక్క, పాముకాటు కోసం వ్యాక్సిన్ భద్రపరిచే గదిని పరిశీలించారు. వేసవి కాలంలో కుక్క కాటు కేసులు అధికంగా వస్తాయని అందరికీ వ్యాక్సిన్ వేసే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు .వ్యాక్సిన్ కొరత లేకుండా చూడాలని సూపరింటెండెట్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కేసా రవి, ఆసుపత్రి సూపరింటెంట్ శ్రీనివాస్ సమరద్, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ యూసుఫ్ పాల్గొన్నారు.



అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర కోరారు. మంగళవారం స్థానిక రైతువేదికలో మిర్యాలగూడ నియోజకవర్గ స్థాయి విలేజ్ ఆర్గనైజేషన్‌చైర్మెన్ల అమ్మ ఆదర్శ పాఠశాల అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ కార్యక్రమం ఉద్దేశించిందన్నారు. పాఠశాలలో సౌకర్యాలు కల్పించేందుకు పంచాయతీ రాజ్ ఇంజనీర్లు ఆర్గనైజేషన్ చైర్మెన్లు సమన్వయంతో పనులు గుర్తించాలని పనులను బట్టి 5 లక్షల నుండి 30 లక్షల వరకు మంజూరు చేస్తారన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఓలు ఎం. శేషగిరి శర్మ పి. కరుణాకర్ రావు, జానయ్య. పాల్గొన్నారు.

నకిరేకల్‌లో పోలీసు బలగాలతో కవాతు

నవతెలంగాణ-నకిరేకల్

పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా మంగళవారం నకిరేకల్ పట్టణంలో పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీ రాముల నాయక్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికలలో భాగంగా నకిరేకల్ నియోజకవర్గంలో 30 సమస్య ఆత్మక ప్రాంతాలుగా గుర్తించామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 20 లైసెన్సుడు గనులను స్వాధీనం పరుచుకున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్పి శివరాం రెడ్డి, ఎస్ఐ గోపికృష్ణ పాల్గొన్నారు.



మౌలిక వసతుల కల్పనకు కృషి చేయండి

- డీఈఓ బిక్షపతి

నవతెలంగాణ -నకిరేకల్

విద్యా సంవత్సరం ప్రారంభ నాటికి అన్ని పాఠశాలల్లో మౌలిక వస్తువుల కల్పనకు కృషి చేయాలని డీఈఓ బిక్షపతి కోరారు. మంగళవారం స్థానిక రైతు వేదిక భవనంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ లకు నకిరేకల్ నియోజకవర్గ స్థాయి పాఠశాల మౌలిక వసతువుల కల్పనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి కనీస సౌకర్యాల కల్పనలో ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సహకరించి మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, మేజర్, మైనర్ మరమ్మత్తు పనులను గుర్తించి వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ అడిషనల్ పీడీ శారద,ఏ ఎం ఓ రమేష్ రెడ్డి, ఎంఈఓ ఎం నాగయ్య ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

బెల్లయ్య నాయక్‌ను కలిసిన ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్ర గిరిజన డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్‌గా నియమితులైన డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్‌ను నల్లగొండ జిల్లా లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ రమావత్ సక్రు నాయక్, రమేష్ నాయక్, సందీప్ నాయక్, రాజేష్ నాయక్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

30న ఎన్నికల సన్నాహక సమావేశం

- డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశం ఈనెల 30న ఉదయం 11 గంటలకు హుజూర్‌నగర్ నియోజకవర్గం మఠంపల్లి మండలం మట్టపల్లి గ్రామంలో నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ తెలిపారు. మంగళవారం నల్గొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 28న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో సీఈసీ సమావేశానికి వెళ్లాల్సి ఉండడంతో సమావేశాన్ని 30కి వాయిదా వేయడం జరిగిందని ,నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సమావేశం యథావిధిగా జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలోని పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జీలు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు కత్తుల కోటి, మాజీ కౌన్సిలర్లు మందడి శ్రీనివాస్ రెడ్డి, మహమ్మద్ ఇంతియాజ్ అలీ, నాయకులు జూలకంటి సైదిరెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టా రాకేష్, గోలి రవి, పెరిక చిట్టి తదితరులు పాల్గొన్నారు.

యువత సేవా కార్యక్రమాల్లో ముందుండడం అభినందనీయం

- ఎమ్మెల్యే వేముల వీరేశం

నవతెలంగాణ- నకిరేకల్



యువత సేవా కార్యక్రమాల్లో ముందు ఉడడం అభినందనీయమని ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చందుపట్ల గ్రామంలో భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గ్రామస్తుల దాహార్తిని తీర్చడం కోసం వేసవిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు అనంతరం గ్రామంలో నెలకొని ఉన్న నీటి సమస్యపై ఎమ్మెల్యే వీరేశం కొవ్వు విన్నవించారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ బచుపల్లి శ్రీదేవి గంగాధర్ రావు, నాయకులు నకిరేకంటి ఏసు పాదం, గాధగోని కొండయ్య, మల్కిరెడ్డి రంగారెడ్డి, ఇమడపాక లక్ష్మి, పుట్ట సరిత, భగత్ సింగ్ యూత్ అధ్యక్షుడు వడ్డెబోయిన శివ, ప్రతినిధులు ఎర్ర శరత్, జాని, సంద్ర సంతోష్, బి వెంకటాచారి, సైదులు, సందీప్, శేఖర్ పాల్గొన్నారు.


పంట పొలాల పరిశీలనకు త్వరలో కేసీఆర్ పర్యటన

రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ- నల్లగొండ టౌన్

ఎండిన పంట పొలాల పరిశీలనకై నల్లగొండ ఉమ్మడి జిల్లాలో త్వరలో గులాబీ బాస్ కెసిఆర్ పర్యటించనున్నారు. నల్లగొండ లోక్ సభ పరిధిలోని ముషంపల్లి గ్రామాన్ని భోనగిరి లోకసభ పరిధిలోని ఆలేరు గ్రామాన్ని సందర్శించనున్నారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అభ్యర్థన మేరకు స్పందించిన కేసిఆర్ ఆర్ రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన పంట నష్టం వివరాలను స్వయంగా తెలుసుకునేందుకు గాను మాజీ ముఖ్యమంత్రి, గులాబీ బాస్ కేసీఆర్ రంగంలోకి దిగుతున్నారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గత వారం రోజులుగా ఎండిన పంటపొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుకు సంబంధించిన నివేదికను అధినేత కు అంద జేయడం తో పాటు మీరు కుడా స్వయంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో జరిగిన నష్టాన్ని పరిశీలించాలని అభ్యర్థించారు. అందుకు అనుగుణంగా స్పందించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం రాత్రి తనను కలిసిన కంచర్ల బ్రదర్స్ తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నల్లగొండ మండలం ముషంపల్లితో పాటు ఆలేరు నియోజకవర్గ పరిధిలో



పర్యటించాలని ఆయన నిర్ణయం తీసుకున్నారు. గడిచిన పదేండ్లు ఎండిపోని పంట పొలాలు ఈ మారు ఎందుకు ఎండి పోయాయో అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవ పరిస్థితిని నల్లగొండ మాజీ శాసనసభ్యుడు కంచర్ల భూపాల్ రెడ్డి వివరిస్తుంటే తట్టుకోలేక పోయిన కేసీఆర్ తక్షణమే తానే స్వయంగా క్షేత్ర స్థాయిలో రంగంలోకి దిగి ఎండి పోయిన పంట పొలాలను పరిశీలిస్తానని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో మాట్లాడి రూట్ మ్యాప్ తయారు చేస్తామని కేసీఆర్ కంచర్ల బ్రదర్స్ కు చెప్పారు.అత్యధికంగా బోర్లు వేసి నష్టపోయిన నల్లగొండ మండలం ముషంపల్లి గ్రామం నుండే ఈ పరిశీలన మొదలు పెట్టేవిధంగా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు.

బిచ్చునాయక్ కుటుంబసభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి

నవతెలంగాణ-చివ్వెంల

మండలపరిధిలోని గాయంవారి గూడెం గ్రామపంచాయతీ ఆవాసం బంగారితండాకు చెందిన కాంగ్రెస్ సీనియర్‌నాయకులు ధరావత్ బిచ్చునాయక్ సోమవారం మృతి చెందారు.బిచ్చునాయక్ పార్థివదేహనికి మాజీ మంత్రి,కాంగ్రెస్ సూర్యాపేట ఇన్‌చార్జి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పూలమాలలేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చింతమళ్ళ రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ధరావత్ వీరన్ననాయక్, గ్రామశాఖ అధ్యక్షులు జేరిపోతుల కృష్ణయ్యగౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు కలకోట్ల సంజీవ పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) సానుభూతిపరురాలు మృతి

నవతెలంగాణ-నేరేడుచర్ల

అనారోగ్య కారణాలతో సీపీఐ(ఎం) సానుభూతిరాలు బోయినపల్లి యాదమ్మ (75) మంగళవారం మరణించారు.ఈమె గతంలో పార్టీ అనుబంధమైన మహిళా సంఘంలో పనిచేశారు.ఆమె మృతదేహాన్ని పార్టీ పట్టణ కార్యదర్శి కొదమ గుండ్ల నగేష్ సందర్శించి పూలమాలలేసి నివాళు లర్పించారు. నివాళులర్పించిన వారిలో కుంకు తిరుపతయ్య, నీలారామ్మూర్తి, మొగిలిచర్ల రుద్రమ్మ, అనెగంటి మీనయ్య, శ్రీను, ఐల శ్రీను తదితరులు ఉన్నారు.





గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి

నవతెలంగాణ-తుంగతుర్తి

జీవాలకు వచ్చే గాలికుంటు వ్యాధి పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని,వ్యాధి నివారణకు పశుసంవర్ధక శాఖ వైద్యుల సలహాలు తీసుకుంటూ క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కుమారస్వామి అన్నారు.మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణా టీకాలేసే కార్యక్రమాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. వ్యవసాయానికి అనుబంధంగా పాడిపరిశ్రమతో ఆర్థికంగా బలపడుతున్న రైతులు నష్టపోకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతిఏడాది రెండుసార్లు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు వేస్తున్నారని తెలిపారు.ఈ అవకాశాన్ని ప్రతి పాడిరైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ వ్యాధి వల్ల పాల దిగుబడి తగ్గుతుందని,తీవ్రతరమైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. మండలంలోని ప్రతిపశువుకు ఈ వ్యాధి నివారణా టీకాను వేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.పశువుల పాకలను శుభ్రంగా ఉంచుకోవాలని,పశువులను ఎండబారి నుండి కాపాడుకోవాలన్నారు.స్వచ్ఛమైన తాగునీరు, మేత అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యశాల ఏడీ డాక్టర్ వెంకన్న,తుంగతుర్తి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ డాక్టర్ బయ్యగాని రవి ప్రసాద్,తుంగతుర్తి మండల పశువైద్యాధికారులు డాక్టర్ నరేష్,డాక్టర్ మమత,వెటర్నరీ అసిస్టెంట్లు సుష్మ,రవి, బుచ్చిబాబు,మండల గోపాలమిత్రలు లింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

నవతెలంగాణ-మునగాల

మండలపరిధిలోని ఆకుపాముల సమీపంలో 65 జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు.ఎస్‌ఐ బైరెడ్డి అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్ళచెర్వు మండలం కందిబండ గ్రామానికి చెందిన తమ్మారపు రాంబాయిమ్మ(50),వెంకటనర్సయ్య(30) తల్లీకొడుకులు. బైక్‌పై సూర్యాపేటలో జరిగే ఫంక్షన్‌కు వెళ్ళారు.తిరుగు ప్రయాణంలో భగత్ కాలేజీ వద్దకు రాగానే ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను బైక్ ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు.మృతదేహాలను కోదాడ మార్చురీకి తరలించారు.పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.



క్షయపై అవగాహన పెంపొందించాలి

- మండల వైద్యాధికారి పుష్పలత

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌రూరల్

ప్రజల్లో క్షయ వ్యతిరేక కార్యక్రమాన్ని భారీ ఉద్యమంగా మార్చి అవగాహనను పెంపొందించాలని మండల వైద్యాధికారి పుష్పలత అన్నారు. ప్రపంచ క్షయ నిర్మూలనా దినోత్సవం సందర్భంగా లింగగిరిలో జరిగిన కార్యక్రమంలో మంగళవారం క్షయ వ్యాధి నిర్మూలనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.క్షయవ్యాధిని నివారించేందుకు ప్రభావవంతమైన చికిత్స అందుబాటులో ఉందన్నారు.ఈ వ్యాధిని కొందరు కలంకంగా భావిస్తున్నారని, ఈభ్రమను పొగొట్టుకొని మన చుట్టుపక్కన రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి వేళ్లల్లో చెమటలు పట్టడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, తేమడలో రక్తజీరలు వంటి లక్షణాలు కలిగిన వారు మీ దగ్గరలోని ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి, పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితమందులు రోగులకు పోషకాహార నిమిత్తం నెలకు రూ.500 చికిత్స కాలంలో ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ పద్మ, హెచ్‌ఈఓ గజగంటిప్రభాకర్, ఎస్‌టీఎస్ మమత, ఇందిరాల రామకృష్ణ, యు.శ్రీనివాస్, ల్యాబ్ టెక్నిషియన్ రమేష్, ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

టెట్, డీఎస్సీ పరీక్ష ఫీజులు తగ్గించాలని సీఎంకు లేఖ

నవతెలంగాణ-తిరుమలగిరి

టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ఫీజులను ఒక్కో పేపర్‌కు రూ.200 నుండి రూ.వెయ్యి, డీఎస్సీ అప్లికేషన్ రుసుము పెంచుతూ రాష్ట్ర విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసిన టెట్ సమగ్ర నోటిఫికేషన్‌లో పేర్కొన్న నేపథ్యంలో టెట్ పరీక్ష ఫీజులను అదేవిధంగా డీఎస్సీ రుసుము కూడా తగ్గించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి, విద్యాశాఖ డైరెక్టర్ దేవసేనకి సూర్యాపేట జిల్లా ప్రయివేట్ లెక్చరర్స్ ఫోరం సహాయ కార్యదర్శి తీగుళ్ల శ్రీనివాస్ బహిరంగలేఖ రాశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఫీజులు లేకుండా పోటీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొని ఇప్పుడు ఉపాధ్యాయ అర్హత పరీక్షకు పోటీపడే అభ్యర్థులకు ఫీజులు పెంచడం ద్వారా రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగులకు భారమవుతుందన్నారు.నిరుద్యోగుల ప్రయోజనాల దృష్ట్యా టెట్ పరీక్ష ఫీజులు, డీఎస్సీ అప్లికేషన్ రుసుము తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నెలుట్లరాజు, మోడెపు సురేందర్, సంగేపాక ప్రభాకర్, గండమల్ల వెంకన్న, కుంభం మురళి పాల్గొన్నారు.



మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

- అసెంబ్లీ సెగ్మెంట్స్‌లలో పీఓ,ఏపీఓలు శిక్షణ అందించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావు

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

జిల్లాలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో పీఓ,ఏపీఓల మొదటి ర్యాండమైజేషన్ పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావు అన్నారు.మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్‌హాల్‌లో లోక్‌సభఎన్నికల సందర్భంగా పీఓ,ఏపీఓల మొదటి ర్యాండమైజేషన్ పూర్తి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్.లతతో కలిసి మాట్లాడారు.జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పీఓ,ఏపీఓలకు ఎన్నికల నిర్వహణ, విధివిధానాలపై మాస్టర్ ట్రైనర్స్‌తో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఎన్నికల నిర్వహణకు 5664 మంది సిబ్బందిని ఎంపిక చేయడం జరిగిందని అలాగే ర్యాండమైజేషన్‌ను మరో రెండు దఫాలుగా చేపట్టడం జరుగుతుందన్నారు. అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాటు చేయనున్న శిక్షణా కార్యక్రమాల్లో పీఓ, ఏపీఓలు తప్పక హాజరయ్యే విధంగా ఆయా నియోజకవర్గ అధికారులు చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా ఏర్పాట్లను చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సీఈఓ అప్పారావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాసరాజు, ఏఓ సుదర్శన్‌రెడ్డి, నరేందర్, ఈడీఎం గఫార్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సంఘబంధాలలో వీబీకేల అవినీతిపై విచారణ జరపాలని వినతి

- సంఘబంధాల బాడీలను మార్చి,కొత్త బాడీలను ఎన్నుకోవాలి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

ఆత్మకూరు(ఎస్)మండలం పాతర్లపాడు గ్రామంలో సంఘబంధాలలో జరుగుతున్న అవినీతిపై విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని పాతర్లపాడు సంఘబంధం సభ్యులు పులి వినోద, బోలక పద్మ భీమగాని రాధమ్మ అన్నారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎస్.వెంకట్రావుకు



వినతిపత్రం అందజేశారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ పాతర్ల పాడు గ్రామంలో విలేజ్ బుక్ కీపర్ (వీబీకే)లు గుంటూరు తిరుమలమ్మ, మద్దికుంట్ల రాధ, కొప్పుల మానసలు సంఘబంధంలో వీబీకేలుగా పని చేస్తున్నారని,పదేండ్ల నుండి వారు చెప్పిందే వేదంగా అమాయకులైన చదువురాని సంఘబంధ సభ్యుల వద్ద బుక్కులు దగ్గర పెట్టుకొని వారి చేత సంతకాలు పెట్టించుకుంటున్నారని, పొదుపు తీసుకున్నారంటే పర్సంటేజీల రూపంలో వాళ్లకు ఇవ్వాల్సిందే లేదంటే లోన్లు ఇవ్వమని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హతలు లేకుండా వీరు వీబీకేలుగా కొనసాగుతున్నారని, గ్రామంలో ఎంతోమంది కంప్యూటర్ నాలెడ్జి ఉన్న అర్హత లేని వాళ్లు ఉన్నారని వీళ్లనే ఎందుకు కొనసాగించాలని డిమాండ్ చేశారు.రెండేండ్లకోసారి నూతనబాడీని ఎన్నుకోవాలి, నిబంధనలు ఉన్నప్పటికీ నిబంధనలను తుంగలో తొక్కి అధ్యక్ష,ప్రధానకార్యదర్శి, కోశాధికారి ,కార్యదర్శి,వీబీకేలను అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించి వెంటనే నూతన బాడిన ఏర్పాటు చేయాలన్నారు.తాళ్లసింగారం గ్రామంలో ఎస్‌బీఐ శాఖ వారిలో దాదాపు మూడు కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని వార్తాపత్రికల్లో వచ్చిందన్నారు.మా గ్రామ సమభావన సంఘాలలో పొదుపు చేస్తున్న మహిళ సంఘాలు 77 ఉన్నాయన్నారు.ఇవన్ని కలిసి 3 సంఘ బంధాలుగా ఆర్థిక లావాదేవీలు జరుపుతున్నారని తెలిపారు.ఎస్‌బీఐ అకౌంట్‌లో రూ.లక్ష జమయ్యాయన్నారు. అందులో నుండి మా గ్రూప్ అధ్యక్షురాలు అకౌంట్ కు 49000 వేలు జమ అయినట్టు వచ్చినవని, మిగతా రూపాయలు జమ కాలేదన్నారు.లక్ష రూపాయలు సంఘ బంధం వీబీకే గుంటూరు తిరుమలమ్మ మమ్మల్ని, బ్యాంకు వారిని మోసం చేసి ఆ రూపాయలను డ్రా చేసుకొని స్వప్రయోజనాల కోసం వాడుకుంటుందన్నారు.ఈ విషయంపై బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించగా వీబీకే మీకు తెలియకుండా తీసుకున్నదని తెల్పి చెప్పగా మేము వీబీకేను నిలదీయడంతో మమ్మల్ని ఇష్టం వచ్చినట్టు తిట్టినానా దుర్భాషలాడిందని తెలిపారు.ఈ ముగ్గురు వీబీకేలు చేస్తున్న అవినీతిపై జిల్లా ఉన్నతాధికారి విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ సమావేశంలో గాదగాని శోభ, పబ్బతి గంగమ్మ,యమగాని లక్ష్మి గుంటూరు లలిత,గంగపురి స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

- అయినా ఆగని ఇసుక దందా
- పోలీసుల నామమాత్రపు తనిఖీలు

నవతెలంగాణ-ఆత్మకూరుఎస్

మండల పరిధిలో ఏపూర్ గ్రామంలో 15రోజులుగా ఇసుక దందా కొనసాగుతుంది. కొద్ది రోజులు పగలు ట్రాక్టర్ల ద్వారా తరలించగా స్థానికుల ఒత్తిడి మేరకు పోలీసులు నామమాత్రపు చర్యలు తీసుకోని కేసులు చేసి వదిలేశారు.తర్వాత ఏపూర్ బ్రిడ్జి వద్ద ట్రాక్టర్లు పోకుండా పోలీసులు గాతులు తవ్వించారు.ఇక పగలు మానేసి రాత్రి వేళల్లో ఏపూర్ ఏటి నుండి ఇసుక తరలింపు లింగంపల్లి మీదుగా తరలిస్తున్నారు. స్థానికులు పోలీసులకు ఎంత సమాచారం ఇచ్చినా ఫలితం లేకపోవడంతో గ్రామస్తులే రంగంలోకి దిగి సోమవారం రాత్రి ఏటిలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఒక సందర్భంలో ఇసుక తరలింపు వారు గ్రామస్తులపై దాడికి పాల్పడినట్టు సమాచారం.ఏపూరు గ్రామస్తుల నుండి కూలీల కారణంగా బయటికి సమాచారం పోతుందని లింగంపల్లి కూలీలను ఏర్పాటు చేసుకున్నట్టు తెలుస్తోంది. మంగళవారం సూర్యాపేట ఆర్డీఓ వేణు మాధవ్‌రావు ఆత్మకూర్ రెవెన్యూ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్‌కు ఇసుక తరలింపు పై చర్యలు తీసుకోవాలని సీరియస్‌గా చెప్పినా ఇసుక తరలింపు ఆగడం లేదని గ్రామస్తులు తెలిపారు.



ఇసుక తరలింపులో అధికార పార్టీకి చెందిన ట్రాక్టర్లు ఉండడంతో గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొనే ప్రమాదం ఉందని గ్రామస్తులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.ఒక వైపు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ ఇసుక దందాను అరికట్టలేకపోవడంతో అధికారులపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

'సాగు, తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలి'

నవతెలంగాణ-మద్దిరాల

గ్రామాలలో సాగు,తాగునీటి ఎద్దడిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పేర్ల నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం మండలంలోనీ వివిధ గ్రామాల్లో వరి పంటల స్థితిగతులను పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ,ప్రభుత్వం అనుసరిస్తున్న అసమగ్ర నీటి విధానం, నీటి పారుదల శాఖ నిర్లక్ష్య వైఖరి వలన రైతాంగం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం పంటలకు నీరు సరిపడా ఇస్తామని అంటుంది కానీ చివరిభూముల వరకు నీరు రావడం లేదన్నారు.నీటిపారుదల శాఖ వారు కాలువల మీద సమగ్రపర్యవేక్షణ చేయకపోవడంతో నీరంతా వృథాగాపోవడం, అక్రమంగా నీరు తోడడం, కాలువలకు గండ్లు పడడం వంటివి జరుగుతున్నాయన్నారు.ఎండిన పొలాలకు ఎకరాకు రూ.50వేలు పరిహారం చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కన్వీనర్ నర్సయ్య, ఎడ్ల వెంకన్న, పెరుమాళ్ళ భాస్కర్, ఒలిమెడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలాజీ వెంకటేశ్వరస్వామి కల్యాణం

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణపరిధిలోని తమ్మరబండ పాలెం గ్రామంలో స్వయంభుగా వెలిసిన బాలాజీ వెంకటేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా ఆలయ అర్చకులు సోమవారం రాత్రి నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఆలయ చరిత్ర తమ్మరబండ పాలెం లో సుమారుగా వెయ్యి ఏండ్ల కింద తూర్పు నుండి తెల్ల గుర్రంపై వచ్చి వెంకటేశ్వరస్వామి ఇక్కడ వెలిశారు.ఇక్కడ ప్రత్యేకతలు కొలిచిన వారికి కొంగుబంగారమై కోరికలు తీర్చడం ఈ స్వామి ప్రత్యేకతని భక్తుల నమ్మకం.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల రమేష్, వార్డు కౌన్సిలర్ నరేష్, అనువంశిక ధర్మకర్త ముడుంబై వేణుగోపాలాచర్యులు, దేవాలయకార్యదర్శి తుమ్మల వెంకటచలపతిరావు, రమేష్ పాల్గొన్నారు.

బొమ్మగాని ధర్మభిక్షం 13వ వర్ధంతి

నవతెలంగాణ-నేరేడుచర్ల

నేరేడుచర్ల పట్టణకేంద్రంలో బొమ్మగాని ధర్మభిక్షం 13వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాళ ధనుంజయనాయుడు పూలమాలలేసి నివాళులర్పించారు.ఈకార్యక్రమంలో మండలకార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేశ్, రావుల సత్యం, సీఐటీయూ మండలకార్యదర్శి నీలా రామ్మూర్తి, కుంకు తిరుపతయ్య, అనెగంటి మీనయ్య, అయిల నాగేశ్వర్‌రావు, కర్రి సతీష్‌రెడ్డి, మదార్, లింగయ్య పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలో మాజీ ఎంపీ ధర్మభిక్షం వర్ధంతిని కల్లుగీత పనివారల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు పాలకూరి బాబు, నాయకులు బెల్లంకొండ చిరంజీవి, సోమగానికృష్ణ,చిన్నగాని సైదులు, గండుపాపయ్య, బాలబోయినసత్యనారాయణ, కాశయ్య, శంకర్,నర్సయ్య పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో..

అదేవిధంగా సీపీఐ కార్యాలయంలో ధర్మభిక్షం వర్ధంతి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గన్నచంద్రశేఖర్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎల్లావుల రాములు,సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు,కంబాల శ్రీనివాస్,దేవరం మల్లేశ్వరి, జడ శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ, దొంతగాని సత్యనారాయణ, జక్కుల రమేశ్, పి.వాసుదేవరావు,జడ వెంకన్నసుందరి, పద్మ, గోపగాని వెంకటేశ్వర్లు, వెంకన్న పాల్గొన్నారు.

తిరుమలగిరి : తిరుమలగిరి చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో బొమ్మగాని ధర్మభిక్షం 13వ వర్ధంతి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు యాదగిరి, మండల కార్యదర్శి తిపిరాల శ్రీకాంత్,సామాజిక తెలంగాణ అధ్యక్షుడు కొత్తగట్టు మల్లయ్య, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఫయాజ్,జంబు రాష్ట్ర నాయకులు ఫత్తేపురం యాదగిరి, రామ్‌గౌడ్,నాయకులు కనుక అశోక్,ముత్యాల పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత వేడుకలు

తిరుమలగిరి : మండలంలోని కోట్యానాయక్ పంచాయతీపరిధిలోని గుడిబండ తండాలో మంగళవారం దుర్గామాత మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గిరిజనులు, ప్రజలు దుర్గామాతకు బోనాలతో పాటు ప్రత్యేకపూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌మండలఅధ్యక్షులు నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జిమ్మిలాల్, కోటియానాయక్‌తండా మాజీ సర్పంచ్ ధరావత్‌హైమావతి రామోజీ,దాచేపల్లివెంకన్న, బానోత్‌రాములునాయక్, కౌన్సిలర్‌భాస్కర్‌నాయక్, హీరూనాయక్, రవినాయక్, విజయ్‌నాయక్, ఎర్ర కొమురవెల్లి పాల్గొన్నారు.

'నవతెలంగాణ' వార్తా కథనానికి స్పందన
తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీఓ విచారణ

- తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు
- ఇద్దరి అధికారులకు ఆబ్సెంట్

నవతెలంగాణ-ఆత్మకూర్‌ఎస్

మామూళ్లమత్తులో రెవెన్యూ కార్యాలయం, ఇసుక అక్రమరవాణా, సమయపాలన పాటించని రెవెన్యూ కార్యాలయం రెండురోజులుగా నవ తెలంగాణతో పాటు ఇతర పత్రికల్లో వచ్చిన కథనాలకు కలెక్టర్ వెంకట్రావు స్పందించారు.విచారణ చేపట్టాలని ఆర్డీవో వేణుమాధవరావును ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆత్మకూర్‌ఎస్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ విచారణ చేపట్టారు.ఆర్డీఓ ఉదయం 10గంటలకు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు.10:30 వరకు తహసీల్దార్, సర్వే యర్, సీనియర్ అసిస్టెంట్ కార్యాలయానికి రాక పోవడంతో వారికి హాజర్ రిజిస్టర్‌లో ఆబ్సెంట్ వేశారు . తహసీల్దార్‌కు ఫోన్ చేయగా 11:15 నిమి షాలకు కార్యాలయానికి రావడంతో ఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయ సిబ్బందిని ఆలస్యానికి కారణం ఏంటని ఆరా తీశారు. ఇకనుండి 10 గంటల 30 నిమిషాల తర్వాత కార్యాలయానికి వచ్చినట్టయితే వారిపై తగినచర్యలు ఉంటాయని సిబ్బంది ద్వారా లిఖితపూర్వకంగా తీసుకున్నారు. మండలంలో ఇసుక అక్రమంగా రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ఇసుక తరలింపు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.బొప్పారం గ్రామంలో సర్వేనెంబర్ 101లో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను పరిశీలించి వెంటనే నిలిపివేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.అక్రమ నిర్మాణాలు జరగకుండా తీసుకోవాలన్నారు.విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు షోకాజు నోటీసు అందజేసి 24 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ అంజయ్య, సీనియర్ అసిస్టెంట్‌ఇంద్రకుమార్, సర్వేయర్ బూర వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



'అర్చకసంఘం బలోపేతానికి కృషి చేస్తా'

నవతెలంగాణ-చిలుకూరు

అర్చక సంఘం బలోపేతానికి కృషి చేస్తానని చించి పట్నం రజనీకాంత్ ఆచార్య అన్నారు.మంగళవారం ఆయన్ను మండలంలోని బేతవోలు గ్రామంలో ఉన్న కనకదుర్గమ్మ దేవాలయంలో జరిగిన ధూప దీప నైవేద్య అర్చకసంఘం ఆత్మీయ సమావేశంలో ప్రచార కార్య దర్శిగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అన్ని దేవాలయాలలో ధూప దీప నైవేద్య అర్చనలు జరిగే విధంగా కృషి చేస్తానని తెలిపారు.తాను చిలుకూరు మండలం కాలవ ఒడ్డు ఆంజనేయ స్వామి దేవాలయంలో అర్చకులుగా పనిచేస్తున్నానన్నారు.తన ప్రచార కోదాడ కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు దౌలతాబాద్ వాసుదేవశర్మ,సూర్యాపేట జిల్లా అధ్యక్షులు అన్నంబొట్ల ఫణికుమార్‌శర్మ, సూర్యాపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాయప్రోలు శ్రీరామశర్మలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం చిలుకూరు మండల కమిటీ రజనీకాంత్ ఆచార్యను ఘనంగా సన్మానించింది.



వైభవంగా సంతాన వేణుగోపాలస్వామి కల్యాణమహోత్సవం

నవతెలంగాణ-కోదాడరూరల్

మండలపరిధిలోని తొగర్రాయి గ్రామంలోని సంతాన వేణుగోపాల స్వామి వారి కల్యాణమహోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారిని పెండ్లి కుమారుడిగా గరుడవాహనంపె ముస్తాబు చేసి, అమ్మవార్లను పెండ్లికూతుళ్లుగా అలంకరించి పల్లకిలో వేంచింపచేసి దివిటీ ఉత్సవం, ఎదుర్కోలు ఘనంగా నిర్వహించారు.కల్యాణమండపానికి చేరుకున్న స్వామివారు అమ్మవార్లకు తిరుకల్యాణమహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు యాదా శ్రీనివాసరావు జ్యోతి, దేవాలయచైర్మెన్ అమరనేని వెంకటేశ్వర్‌రావు, సంధ్య, తాజా మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ గురవమ్మ, మదన్, దేవాలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, శ్రీధర్, సురేష్, అర్చకులు విష్ణువర్ధన ఆచార్య, రాకేష్‌శర్మ రామకృష్ణ ఆచార్య పాల్గొన్నారు.

డ్రోన్లతో వ్యవసాయంపై అవగాహన

నవతెలంగాణ-పెన్‌పహాడ్

డ్రోన్లతో వ్యవసాయంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతునేస్తం కార్యక్రమంలో విత్తనాలు వెదజల్లే విధానాల గూర్చి మండల కేంద్రంలోని రైతువేదికలో దృశ్య మాధ్యమికలో రైతులకు మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. సమగ్ర వ్యవసాయంపై అఖిల భారత సమగ్ర వ్యవసాయ పద్ధతుల పరిశోధన విభాగం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గోవర్ధన్ డ్రోన్లతో వ్యవసాయ విధివిధానాలను, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ రాంగోపాల్‌వర్మలు దృశ్య మాధ్యమికలో రైతులకు సలహాలు, సూచనలు చేస్తూ పొలాలలో వివిధ రకాల పంటలపై డ్రోన్లతో మందు పిచికారీ చేసే విధానం సులభతరమని, రైతులకు తక్కువ సమయంలో తక్కువఖర్చుతో పనులు పూర్తయితాయన్నారు.12 నిమిషాల వ్యవధిలో ఒక్క ఎకరానికి 6 కేజీల నుండి 8 కేజీల వరకు విత్తనాలు వెదజల్లవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కృష్ణసందీప్, ఏఈఓలు సంధ్య, మనోజ్, గోపి, రేణుక, సుష్మరైతులు పాల్గొన్నారు.





పండుగకు ముస్తాబైన శ్రీకంఠమహేశ్వరస్వామి దేవాలయం

నవతెలంగాణ-మోతె

గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ కంఠమహేశ్వర స్వామి సురమాంబ దేవాలయము దాతలగౌడ కులస్తుల సహకారంతో నిర్మించారు.ఈ ఆలయం ఈనెల 29 నుండి పండగ జరుపుకోవడానికి ముస్తాబు చేశారు.మోతే మండలపరిధిలోని రాఘవపురం రాఘవపురం ఎక్స్‌రోడ్డు గౌడ కులస్తులు పండుగ నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యారు.ఈ ఆలయంపై చెక్కిన చిత్ర విచిత్ర దేవుళ్లను చూసి భక్తులు పరవశితులౌతున్నారు.ఈనెల 29 నుండి మొదలై 31వ తేదీ వరకు పండుగ నిర్వహిస్తున్నట్టు గౌడపెద్దలు పేర్కొంటున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
బుధవారం | మార్చి 27, 2024 | www.navatelangana.com

కలెక్టర్ సమక్షంలో మొదటి రాండమైజేషన్



నవతెలంగాణ-భువనగిరి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే సమక్షంలో పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది కోసం మొదటి రాండమైజషన్ ప్రక్రియ ద్వారా 1052 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్స్, 1054 మంది ఏపిఓలు, 2165 మంది ఓపిఓలను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, జిల్లా విద్యా శాఖ అధికారి కే.నారాయణ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి జగన్మోహన్ ప్రసాద్, ఇడిఎం సాయి తదితరులు ఉన్నారు.

గ్రూప్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-భువనగిరి

2024-25 సంవత్సరమునకు గాను గ్రూప్స్, యస్‌యస్‌సి, ఆర్‌ఆర్‌బి, బ్యాంకింగ్, తదితర రాష్ట్ర, కేంద్ర స్థాయి ఉద్యోగాల కోసం టిఎస్ ఎస్‌ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఫౌండేషన్ కోర్స్ ద్వారా మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి యం.జయపాల్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 వరకు స్థానికంగా ఉన్న స్టడీ సర్కిల్ యాదాద్రి భువనగిరిలో స్పాట్ అడ్మిషన్లు తీసుకోవడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు డిగ్రీలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 9492363910 నంబరును సంప్రదించాలన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు తమ కులము, ఆదాయము, పదవతరగతి మెమో, డిగ్రీ సర్టిఫికెట్స్, ఆధార కార్డు మరియు పాస్ పోర్ట్ సైజు పోతోలతో స్పాట్ అడ్మిషన్లకు రావాలన్నారు.

బ్యాంకుల ద్వారా అవినీతికి బీజేపీ చట్టబద్ధత

- అవకాశవాదంగా బీజేపీ రాజకీయాలు
- క్రీడ్ క్రోప్ ద్వారా లంచగొండి వ్యవహారం
- పార్లమెంటు ఎన్నికల్లో సీపీఐ(ఎం)ను గెలిపించండి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం





నవతెలంగాణ-భువనగిరి

ఎలక్ట్రో బాండ్ల ద్వారా బ్యాంకుల ద్వారా అవినీతికి చట్టబద్ధత బీజేపీ తెచ్చిందని, నేడు దేశంలో రాజకీయాలు అవకాశవాద రాజకీయాలుగా మారాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలో కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి ఎండి.జహంగీర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో పదేండ్లుగా బీజేపీ అవినీతి అక్రమాలు, ఇచ్చిన హామీలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, అవినీతి, మహిళలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేదన్నారు. మహిళల అభివద్ధి జరగకపోగా వారిపై విపరీతంగా దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్ట్రో బాండ్ల ద్వారా రూ.16 వేల కోట్లు బ్యాంకుల ద్వారా వివిధ పార్టీలకు అందాయన్నారు. అందులో రూ.8వేల కోట్లకు పైగా బీజేపీకి అందాయని ఆరోపించారు. ఎలక్షన్స్ బాండ్ల తీసుకుంటూ తద్వారా లంచగొండి వ్యవహారాలను బీజేపీ చేస్తుందన్నారు. అరవింద డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డి అరెస్టు అయిన తర్వాత ఆ కంపెనీ నుండి సుమారు 60 కోట్ల రూపాయలు బీజేపీకి అందజేయబడ్డాయన్నారు. గతంలో కాంగ్రెస్ ఆరోపించిన విధంగా ఔటర్ రింగ్ రోడ్‌లో అవినీతి జరిగిందనే విషయం నేడు స్పష్టమవుతుందన్నారు. డబ్బులు తీసుకోకపోవడంతో పాటు బాండ్స్ పై సుప్రీంకోర్టులో కేసులో భాగస్వామ్యం చేయాలని తెలిపారు. పార్టీలు మారడం నేడు శాసనంగా మారిందన్నారు. రాజకీయాలు, వ్యాపారాలు వేరువేరుగా ఉండాలని లేకపోతే ప్రజల యొక్క సమస్యల పరిష్కారం కావని తెలిపారు. ప్రజలు ఈ విషయాలను గమనించాలన్నారు. కార్పొరేట్ శక్తులను నిరాకరించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం గతంలో ఇజ్రాయిల్ నుండి అత్యాధునిక ఫోన్ టాపింగ్ పరికరాలను కొనుగోలు చేసిన విధంగానే నేడు బీఆర్‌ఎస్ ఫోన్ టాపింగ్ కొనుగోలు చేసినట్లు సమాచారం అన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరారు. రానున్న ఎన్నికల్లో సీపీఐ(ఎం)ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్ 34 ఏండ్లుగా విద్యార్థి దశ నుండి పార్టీలో కొనసాగుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా మరియు యాదాద్రి భువనగిరి జిల్లాలో వేరువేరుగా జరిగిన జిల్లా స్థాయి సమగ్రాభివద్ధి పాదయాత్రలో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నట్లు తెలిపారు. ఆ సమస్యల పరిష్కారం కోసం పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. మూసి కాల్వలో పనులు పూర్తి చేయాలని వాటిని ప్రక్షాళన చేయాలని మూసి పాదయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో సుత్తి కొడవలి నక్షత్రం పై ఓటు వేసి సీపీఐ(ఎం)ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ అభ్యర్థి ఎండి.జహంగీర్ మాట్లాడుతూ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం అన్ని నియోజకవర్గాల్లోనూ పార్టీ కార్యకర్తలు బలంగా ఉన్నారని సీపీఐ(ఎం) పోరాడుతున్న విషయాన్ని ప్రజలు ఆదరించి ఓటు వేస్తారనే నమ్మకం ఉందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ పాల్గొన్నారు.

ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవం

నవతెలంగాణ-భువనగిరి



ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం 2024ని పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో స్థానిక వెటర్నరీ హాస్పిటల్ మీటింగ్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ వై పాపారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శిల్పిని, చౌటుప్పల్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ యశోద, డిటిఓ డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వై పాపారావు మాట్లాడుతూ క్షయ వ్యాధి ఎలా వస్తుంది వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి క్లుప్తంగా వివరించారు. భువనగిరి డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శిల్పిని మాట్లాడుతూ క్షయ వ్యాధికి పూర్తిగా మందులు ఉచితంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లభిస్తున్నాయని వివరించారు. చౌటుప్పల్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ యశోద మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ బాధ్యతగా సేవలు అందించాలని వివరించారు. తదనంతరము క్షయ వ్యాధి గ్రస్తులకు సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిపిపిఎం కోఆర్డినేటర్ సైదులు, టీబిహెచ్ వి ఏ. గిరిబాబు, ఎస్‌టిఎల్‌ఎస్ నటేష్, అశ్విని, ఎస్‌టిఎస్ శ్రీనివాస్ రెడ్డి, జ్యోతి, శాంతి, జానకి, మరియు సీడ్ ఎన్జీవో సంస్థ మేనేజర్ భాను కుమార్, అర్బన్ ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోనాపూర్ సాంబశివుడి వర్ధంతి

నవతెలంగాణ-భువనగిరి



నల్లగొండ ముద్దుబిడ్డ, పీడిత ప్రజల కోసం పోరుబాట చేసిన విప్లవ వీరుడు కోనపురి సాంబశివుడు 13వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం భువనగిరిలో అమరవీరుల స్థూపం వద్ద శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేష్ యాదవ్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి మాట్లాడారు. సాంబశివుడు పేద ప్రజల కోసం తన జీవితం అంతా పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడి అమరుడైన గొప్ప వ్యక్తి అని, సాంబశివుడు చేసిన త్యాగాన్ని గుర్తించి అతని కుటుంబానికి తగిన న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణ యాదవ సంఘం యాదాద్రి జిల్లా ఉపాధ్యక్షుడు గుండబోయిన సురేష్ యాదవ్, జిల్లా కోఆర్డినేటర్ అవిశెట్టి రమేష్ యాదవ్, రేకలా రమేష్ యాదవ్ పట్టణ అధ్యక్షుడు మర్రి పాండు యాదవ్, జిల్లా కుర్మ సంఘం నాయకులు ర్యాకల శ్రీనివాసు, నరాల రాజు యాదవ్ గుండ బొయిన నర్సింహ,యాదవ్ భువనగిరి మండలం అధ్యక్షుడు చుక్కలు శంకర్ యాదవ్, బాత్క అశోక్, శ్రీరామ్ శరత్ యాదవ్ రసాల లింగస్వామి యాదవ్, మల్లేష్,భుషబోయిన సిద్ధు పాల్గొన్నారు.



ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

నవతెలంగాణ-ఆలేరుటౌన్

చిన్నగౌరాయపల్లి, రఘునాథపురం గ్రామాల్లో ఆలేర్ పట్టణంలోని ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం విజయవంతమైందని కళాశాల ప్రిన్సిపాల్ కంతం రమేష్ అన్నారు. ఆలేరు పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాల పరిసరాలను శుభ్రం చేయడం, విద్యార్థులకు ఉన్నత చదువుల మీద అవగాహన కల్పించడము జరిగిందన్నారు. ఆదివారం మహాత్మా గాంధీ యూనివర్సిటీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ వసుల మధు ఆకస్మికతనికి చేసి ఎంజియు పరిధిలో ఉన్నటువంటి అన్ని కళాశాల కంటే ఎస్ ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని,నిబద్ధతతో పనిచేస్తున్నారని వాలంటీర్లను మరియు యాజమాన్యాన్ని అభినందించారని తెలియజేశారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గణిత అధ్యాపకులు భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు సర్టిఫికెట్ కోసం కాకుండా విజ్ఞానం కోసం చదువుకోవాలని అన్నారు. బోగ పాండురంగం,ప్రోగ్రామ్ ఆఫీసర్ సింగం అనిల్ కుమార్ పాల్గొన్నారు. 50 మంది ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లుకు ప్రశంసా పత్రాలు చేశారు.

సర్పంచులను బీఆర్ఎస్ కష్టాలపాలు చేసింది

- రాష్ట్ర మాజీ సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ-రాజపేట



గత బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచులను కష్టాలపాలు చేసిందని రాష్ట్ర మాజీ సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం రాజపేటలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండేళ్లుగా గ్రామపంచాయతీలకు రావలసిన పెండింగ్ బిల్లు విషయంలో గత ప్రభుత్వం మొండి వైఖరి కారణంగా అనేకమంది బడుగు సర్పంచులు ఎస్సీ ఎస్టీలు లక్షలాది రూపాయల అప్పు తెచ్చి ప్రభుత్వం నిర్బంధం చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపించి కష్టాలు నష్టాలకు గురి చేశారని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సర్పంచుల కష్టాల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ మంత్రి, సీతక్క, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన పాదయాత్రలో మాట్లాడారనీ.. అధికారంలోకి వచ్చాక ఒక్క రూపాయి ఇవ్వకపోగా గత ప్రభుత్వం చేసిన తప్పు అని ఎత్తు చూపుతున్నారన్నారు. ఇట్టి విషయంలో ప్రభుత్వం పది రోజుల్లో నిర్ణయం తీసుకోకపోతే ప్రతి పార్లమెంటు పరిధిలో 100 మంది తగ్గకుండా ఎన్నికలు పోటీ చేస్తామని రాష్ట్ర సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి హెచ్చరించినారు. ఈ కార్యక్రమంలో మండలంలోని తాజా మాజీ సర్పంచులు పంబ కర్ణాకర్, ఎడ్ల స్వరూప రామచంద్రారెడ్డి, మెండు వెంకటరెడ్డి, మడవత్ దేవి రాముల నాయక్, ఠాకూర్ ధర్మేందర్ సింగ్, జూకంటి మమత బాలస్వామి, నర్సయ్య పాల్గొన్నారు.

ఆయుర్వేదిక్ డాక్టర్‌ను నియమించాలని వినతి

నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

మండల కేంద్రంలోని ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో పూర్తి కాలం డాక్టర్‌ను నియమించాలని కోరుతూ వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి స్పీడ్ పోస్ట్ ద్వారా మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పాశం ధర్మయ మాట్లాడుతూ 35 సంవత్సరాల కిందట మండల కేంద్రంలో ఆయుర్వేదిక్ డాక్టర్ వైద్యుల మోహన్ రావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు స్థలం విరాళంగా ఇచ్చారన్నారు. ఈ స్థలంలో ప్రభుత్వ నిధులచే భవన నిర్మాణం చేపట్టిన ప్రభుత్వం గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందిస్తుందన్నారు. ఇందులో పని చేసే డాక్టర్ బదిలీ అయి మూడు నెలలు కావస్తున్న నూతన డాక్టర్ను నియమించకపోవడంతో వైద్య సహాయం కోసం వచ్చే వృద్ధులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. వెంటనే ముఖ్యమంత్రి స్పందించి పదోన్నతి పై వెళ్లిన డాక్టర్ స్థానంలో పూర్తి కాలం డాక్టర్ ను నియమించాలని ఆయన కోరారు. ఇప్పటికే పలుమార్లు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి,ఆ శాఖ డైరెక్టర్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి పూర్తికాలను డాక్టర్ నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైన్స్ చోరీ ముఠా అరెస్టు



నవతెలంగాణ-భువనగిరి

రాత్రి సమయంలో మూసి ఉన్న వైన్స్ షాపులే టార్గెట్‌గా దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను యాదాద్రి భువనగిరి జోన్ పోలీసులు ఛేదించారు. ఈ చోరీకి సంబంధించిన వివరాలను యాదాద్రి భువనగిరి జోన్ డీసీపీ రాజేష్ చంద్ర మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత అయిదు రోజుల క్రితం యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లిలో రాత్రి సమయంలో దుర్గ వైన్స్ షెట్టర్ పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తుల చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన తుర్కపల్లి పోలీసులు గతంలో ఇలాంటి ఘటనలకు పాల్పడిన నిందితుల వివరాలను సేకరించారు. వారి దర్యాప్తులో భాగంగా కామారెడ్డి పట్టణానికి చెందిన పిన్నోజు రవి గతంలో వైన్స్ చోరీలకు పాల్పడుతుండడంతో పాటు, పలు దొంగతనాలకు పాల్పడుతూ 13 కేసులలో జైలు శిక్ష అనుభవించాడు. రవి కరీంనగర్ జైల్లో శిక్ష అనుభవిస్తుండగా 2023 డిసెంబర్ 5వ తేదీన మేడ్చల్ జిల్లా దుండిగల్ మండలం గాగిలాపూర్‌కు చెందిన బైరప్ప గారి హరీష్ హుస్నాబాద్ పీఎస్ పరిధిలో ఒక చోరీ కేసులో కరీంనగర్ జైలుకు తరలించారు. వీరిద్దరూ జైల్లో పరిచయమై కలిసి చోరీలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. బెయిల్‌పై కరీంనగర్ జైలు నుంచి విడుదల అయ్యారు. అక్కడి నుంచి వచ్చి రాజాపేట వద్ద ఒక వైన్ షాపులో చోరీకి పాల్పడ్డారు. ఈ కేసులో నల్గొండ జైలుకు వెళ్లారు. అక్కడి నుంచి బయటకు వచ్చి యాదాద్రి జిల్లా మోత్కూర్ మండలం ముసిపట్ల గ్రామానికి చెందిన శాఖాపురం నవీన్, సిద్దిపేట పట్టణానికి చెందిన చెప్యాల నర్సింహులు సహాయంతో తుర్కపల్లిలో వైన్స్ చోరీకి పాల్పడి రూ.3,45,600 నగదు, 8 మద్యం బాటిల్స్ను అపహరించారు. చోరీకి పాల్పడ్డ ప్రదేశం వద్ద సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో నిందితులు రెండు ద్విచక్ర వాహనాలపై జగదేవపూర్ వైపు వెళ్తుండగా పోలీసులకు వాసాలమర్రి వద్ద సోమవారం సాయంత్రం కనిపించడంతో వారిని వెంటనే అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ విచారణలో నలుగురు నిందితులు ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. వీరి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, రూ. 2,04,000 నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపించినట్లు డీసీపీ వెల్లడించారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఎ1 రవిపై గతంలో 13 కేసులు, ఎ2 హరీష్‌పై 6 కేసులు, ఎ3 నవీన్ పై రెండు కేసులు ఉన్నాయి. ఇలా వరుస చోరీలకు పాల్పడుతున్న వీరిపై పిడి యాక్ట్ పెట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని డీసీపీ వెల్లడించారు. సీసీ కెమెరాల ద్వారానే నిందితులను గుర్తించగలిగామన్నారు. ఈ కేసును ఛేదించిన పోలీసులను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, యాదాద్రి ఏసీపీ రమేష్ కుమార్, యాదగిరిగుట్ట రూరల్ సీఐ కొండల్ రావు, తుర్కపల్లి ఎస్ఐ తక్యోద్దీన్, సిబ్బంది శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రదీప్ కుమార్, రవి నాయక్, నిరంజన్ శివకుమార్ లు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు కృషి

- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-ఆలేరుటౌన్



గంజాయి నిర్మూలన కృషి చేస్తానని ఆలేరు ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం ఆలేరు నియోజకవర్గంలోని పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కొరకు మీడియా పలు సూచనలు చేయాలని కోరుతూ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మీడియా మిత్రులు ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా గంజాయి ని నిర్మూలన చేపట్టాలని కోరగా పోలీస్ అధికారులతో మాట్లాడి ఎక్కడ కూడా గంజాయి లేకుండా చర్యలు చేపట్టేందుకు ఆదేశాలు ఇస్తామన్నారు. మీడియా మిత్రులకు వారి వారి మండలాల్లో రెవెన్యూ అధికారుల తో మాట్లాడి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎలక్షన్ కోడ్ అంతనరం నియోజకవర్గ వ్యాప్తంగా పల్లెనిద్ర చేసి ప్రజల సమస్యలు తెలుస్కుంటానని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాలను నిర్మూలిస్తామని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు. ఆలేరు నియో జకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాలని, యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ నుండి హనుమకొండ జిల్లా స్టేషన్ ఘనపూర్ వరకు ఏర్పాటు ప్రభుత్వం ఏర్పాటు చేస్తానన్న పరిశ్రమల కారిడార్, అసంపూర్తిగా నిలిచిపోయిందని వెంటనే శ్రీకారం చుట్టాలని, జర్నలిస్టులకు హెల్త్ కార్డులతొ పూర్తిస్థాయిలో వైద్యం అందేలా చూడాలని నవతెలంగాణ రిపోర్టర్ ప్రభుత్వ విప్ బీర్లా ఐలయ్య దృష్టికి తీసుకువెళ్లగా అనుకూలంగా స్పందించారు పై సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తానని జర్నలిస్టుల సమక్షంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఏ సంజీవరెడ్డి, టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి జనగామ ఉపేందర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ, ఎంపీపీ అశోక్, కే వెంకటరాజు ఎంపి ఎజాజ్, కే నరసింహులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-ఆలేరుటౌన్



యువకుడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆలేరు పట్టణంలోని ఎస్‌సి కాలనీ సమీపంలో నివాసముంటున్న యువకుడు డాకూరి శివ(28) మద్యానికి బానిస అయ్యాడు. వివిధ ప్రాంతాలు తిరుగుతూ కుటుంబ బాధ్యతలు పట్టించుకోకుండా, పాత సామాను ఏరుకొని, వచ్చిన సొమ్ముతో మద్యం తాగేవాడని తెలిపారు. మంగళవారం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి వెంకట శ్రీను, ఏఎస్ఐ మోహన్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఆలేరు మండలం శరభనాపురం గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి దీప్తి వరి పంట పొలాలను పరిశీలించారు. వరి పంటలో పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, దిగుబడులు వచ్చే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ శాలిని, రైతు గడ్డ మీద నరేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితురాలికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో పూర్వ విద్యార్థులు తమ తోటి స్నేహితురాలు కంచర్ల మమత ఆర్థిక ఇబ్బందులకు గురికాగా ఆర్థిక సహాయం మంగళవారం అందజేశారు. తోటి స్నేహితులకు ఎలాంటి ఆపద వచ్చినా స్నేహితులుగా అండగా ఉండాలని అన్నారు. సహాయం చేసిన వారిలో రాగుల రవీందర్, కొండమడుగు అశోక్, గడ్డం వెంకటేష్, మకోళ్ళ రాజు, దొమ్మాటి చంద్రమౌళి, వంటల స్వామి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు సన్మానం

నవతెలంగాణ-రాజపేట



మండలంలోని పలువురు విలేకరులు మంగళవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు చేనేత శాలువాతో సన్మానించారు. భువనగిరి న్యూ దీప్తి హొటల్‌లో ప్రజా పాలనకు వంద రోజులు ప్రజానాయకునికి 100 ప్రశ్నలు అనే ఆలేరు నియోజకవర్గస్థాయి విలేకరుల సమావేశం అనంతరం బీర్ల ఐలయ్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రాంజీ నాయక్ చౌహాన్, రాజపేట మండల జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు ఉప్పల రమేష్,, తిప్పారం కనకయ్య, చిన్నం బాలరాజు, భూపతి శ్రీనివాసులు, బిర్రు బాలకిషన్, ఠాగూర్ హిమ్మత్ సింగ్, మహమ్మద్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మ బిక్షం సేవలు మరువలేనివి

- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మేకపోతుల వెంకటరమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-భువనగిరి

ధర్మ బిక్షం సేవలు మరువలేనివని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మేకపోతుల వెంకటరమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కల్లుగీత కార్మిక సంఘం ఉద్యమ నిర్మాత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు నల్లగొండ జిల్లా మాజీ పార్లమెంట్ సభ్యులు మాజీ శాసనసభ్యులు అమరజీవి బొమ్మగాని ధర్మబిక్షం 13వ వర్ధంతి కార్యక్రమాన్ని కల్లుగీత కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని ఏఆర్ గార్డెన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మేకపోతుల వెంకటరమణ బెల్లంకొండ వెంకటేశ్వర్లు వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. అట్టి మహనీయులను స్ఫూర్తితో గీత కార్మికులు తమ సమస్యలపై ఉద్యమం చేయాలని కోరారు. యిట్టి వర్ధంతి కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లా ప్రధాన కార్యదర్శి బోలగాని జయరాములు జిల్లా అధ్యక్షులు రాగీరు కృష్ణయ్య సంఘము మాజీ రాష్ట్ర అధ్యక్షులు మాటూరి బాలరాజు. రాష్ట్ర ఆఫీసు బేరర్ మడ్డి అంజిబాబు. బండ కింది అరుణ్. రాష్ట్ర కమిటీ సభ్యులు రాచకొండ వెంకట్ కొండ వెంకన్న సంఘం నాయకులు బబ్బురి పోశెట్టి బుర్ర శ్రీనివాస్ మల్లము మహేష్ మరియు వృత్తి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భూమి భుక్తి, విముక్తి పోరాటంలో ధర్మ బిక్షం పాత్ర



కీలకం:సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు

బొమ్మగాని ధర్మ బిక్షం 13వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు ప్రసంగిస్తూ నిజాం వ్యతిరేక పోరాటం భూమికోసం భుక్తి కోసం సాగించిన రైతాంగ ఉద్యమంలో ప్రధాన కీలక పాత్ర పోషించినారన్నారు. ఈ సమావేశానికి భువనగిరి సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్ అధ్యక్షత వహించారు. కల్లుగీత కార్మికులకు 50 సంవత్సరాలు నిండిన వారికి రూ.5000 పెన్షన్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ మాట్లాడుతూ 480 గుర్తులతో పెద్ద బ్యాలెట్ పేపర్తో గెలుపొందిన వ్యక్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వస్తువుల అభిలాష్, సోమన సబితా, పుట్టా రమేష్, మల్లేశం, శంకర్, నరసయ్య రేష్మ నాగమ్మ, శివాజీ పాల్గొన్నారు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
బుధవారం | మార్చి 27. 2024 | www.navatelangana.com

ఘనంగా వార్షిక మహోత్సవం



నవతెలంగాణ-చిట్యాలటౌన్

చిట్యాల పట్టణంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో మంగళవారం 21వ వార్షిక మహెూత్సవం వైభవంగా నిర్వహించారు. సుప్రభాతం, క్షీరాభిషేకం, గణపతి పూజ, దుర్గా హెూమం, అమ్మవారికి వడి బియ్యం పోయుట వంటి కార్యక్రమాలు జరిగాయి. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం , మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకట్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్ దంపతులు హోమంలో పాల్గొన్నారు. వార్షికోత్సవమునకు సహకరించిన దాతలకు ఈ సందర్భంగా శాలువాలతో ఘనంగా సత్కరించారు. డైరెక్టర్లు బుద్ధ విమల కృష్ణమూర్తి, గంజి వెంకటేశం, వరకాంతం నర్సిరెడ్డి, రుద్రారపు లింగయ్య, జిట్ట సాయిలు, వనమా నిఖిల్ కుమార్, ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డి తో పాటు కౌన్సిలర్లు, భక్తులుపాల్గొన్నారు

సినిమా పోస్టర్ విడుదల

నవతెలంగాణ-భూదాన్ పోచంపల్లి

అవని క్రియేషన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఆవిష్కరణ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టలను మంగళవారం ప్రముఖ సినీ దర్శకులు శేఖర్‌సూరి చేతుల మీదుగా రిలీజ్ చేశారు. చిత్రానికి సంబంధించిన పాటలను త్వరలో రిలీజ్ చేస్తామని చిత్ర బృందం తెలిపింది. కార్యక్రమంలో సినిమా డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ నిర్మాత రుద్ర నవీన కెమెరామెన్ సూరపల్లి ఉపేంద్ర మ్యూజిక్ డైరెక్టర్ కూరాకుల విజయ్ నటీనటులు నూకల రామ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కోమటిరెడ్డి బ్రదర్స్ కూల్ కాలేదా...!

- అద్దంకి పదవి రానట్టేనా..?

నవతెలంగాణ-నల్లగొండ టౌన్

సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాధినేతగానే కాదు.. తెలంగాణ కాంగ్రెస్ చీఫ్ కూడా, హైకమాండ్ దగ్గరా ఆయన తిరుగు లేకుండా ఉన్నారు. అభ్యర్థుల ఎంపిక మొదలుకొని అన్నింటా ఆయన మార్క్ కనిపిస్తుంది. పవర్ ఫుల్ గా లీడర్ గా కనిపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. తన సహచరుడు అద్దంకి దయాకర్ విషయంలో మాత్రం ఫెయిల్ అవుతున్నారు.అద్దంకి విషయంలో సాక్ష్యాత్తూ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి మాటే చెల్లడం లేదు.

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో దురదృష్టవంతుడిగా అద్దంకి దయాకర్ ముద్ర పడ్డారు. కాంగ్రెస్ గడ్డు పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆయన రెండు సార్లు తుంగతుర్తి నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. కాంగ్రెస్‌కు మంచి రోజులు వస్తాయనుకున్నప్పుడు ఆయనకు టిక్కెట్ దొరకలేదు. అయినా పార్టీ కోసం కష్టపడ్డారు. ఇదిగో ఎమ్మెల్సీ అన్నారు. అదీ రాలేదు. చివరి క్షణంలో పేరు మారిపోయింది. తర్వాత వరంగల్ ఎంపీ టిక్కెట్ అన్నారు. అదీ దక్కలేదు. కంటోన్మెంట్ ఉపఎన్నికలో అయినా సీటు వస్తుందనుకుంటే.. బీజేపీ నేతను చేర్చుకున్నారు.



అద్దంకి దయాకర్ రాజకీయ భవిష్యత్తు కాంగ్రెస్ పార్టీతోనే ప్రారంభమైంది. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. మొదటిసారి 1,847 ఓట్లతో, రెండవసారి 2,379 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. మూడవసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకుంటే అసలు టిక్కెట్టే దక్కలేదు. అద్దంకి దయాకర్‌కు రేవంత్ రెడ్డి మద్దతు ఉన్నా.. ఆయనకు అవకాశాలు రావడం లేదు.
కాంగ్రెస్ పార్టీ పరిస్థితి బాగోలేనప్పుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. దాంతో మునుగోడుకు ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆ సందర్భంగా రేవంత్‌రెడ్డి మునుగోడులో సభ ఏర్పాటు చేశారు. ఆ సభకు రాజగోపాల్ రెడ్డి సోదరుడు కోమటిరెడ్డి వెంకట రెడ్డి హాజరు కాలేదు. పైగా పార్టీకి నష్టం చేసే వ్యాఖ్యలు చేశారు. ఆ సభలో ప్రసంగించిన అద్దంకి దయాకర్ %౯ా% కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఉద్దేశించి అసభ్య పదజాలంతో ఉంటే ఉండు వెళ్తే వెళ్ళు అని దూషించారు. ఈ వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారం రేపింది. అద్దంకి బేషరతుగా కోమటిరెడ్డి వెంకట రెడ్డికి క్షమాపణలు చెప్పారు. కానీ కోమటిరెడ్డి బ్రదర్స్ హిట్ లిస్ట్‌లో మాత్రం అద్దంకి దయాకర్ చేరిపోయారు.
ఎమ్మెల్యే టికెట్ ఇప్పించలేకపోవడంతో అద్దంకికి క్షమాపణలు చెప్పినట్లు స్వయంగా రేవంత్‌రెడ్డి వెల్లడించారు. తర్వాత ఎమ్మెల్సీ పదవి ఇప్పించేందుకు ప్రయత్నించినప్పుడు.. సీనియర్లకు అవకాశం కల్పించాలంటూ పార్టీలో కొందరు అడ్డుపడినట్లు తెలుస్తోంది. దాంతో ఆ ప్రయత్నమూ విఫలమైంది. నల్లగొండ నేతలకు పదవి ఇవ్వాలంటే కోమటిరెడ్డి బ్రదర్స్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలన్న టాక్ పార్టీ నేతల్లో ఉంది. అద్దంకి విషయంలో కోమటి బ్రదర్స్ అనుగ్రహం లేకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్ కూడా పదవి ఇవ్వలేకపోతున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

ధాన్యం సేకరణ సజావుగా కొనసాగేలా కృషి చేయాలి

- ఏప్రిల్ 01 నుండి 18 వరకు కొనుగోలుకేంద్రాల ఏర్పాటు
- అన్ని కేంద్రాల్లో మౌలికవసతుల కల్పన
- కలెక్టర్ ఎస్.వెంకటరావు

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

యాసంగిలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా సంబంధిత అధికారులు, కేంద్రాల నిర్వాహకులు అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ ఎస్. వెంకటరావు సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో యాసంగి పంటకు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, సీఎంఆర్‌పై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కన్ఫరెన్స్‌లో కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు.జిల్లాలో ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు.కొనుగోలు కేంద్రాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అలాగే అన్ని కేంద్రాలు ఏప్రిల్ 1 నుండి ప్రారంభం కావాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కేంద్రాల్లో మౌలికవసతులు కల్పించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం రాకుండా అన్ని చెక్ పోస్టుల్లో గట్టి నిఘా ఉంచాలని సూచించారు. తదుపరి జిల్లాల వారీగా సీఎంఆర్ రైస్ పెండింగ్, వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాల వారీగా సమీక్షించారు.తదుపరి



జిల్లా అధికారులతో కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ మాట్లాడుతూ యాసంగి వరి ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఏప్రిల్ 01 వ తేదీ నుండి 18 వరకు ఐకేపీ ద్వారా 158,పీఏసీఎస్ ద్వారా 63 మొత్తం జిల్లాలో 221 వరి కొనుగోలుకేంద్రాలను రైతులకు అందుబాటులో ఉంచేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.జిల్లాలో కొనుగోలుకేంద్రాలను దాదాపు 3.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని తెలిపారు.పంట విక్రయం విషయంలో రైతులు ఇబ్బందులకు గురికాకుండా, పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు.అకాలవర్షాలకు ధాన్యం తడిసిపోకుండా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్ఓ మోహన్ బాబు,సీపీఓ అప్పారావు, డీఆర్డీఏ పీడీ మధుసూదన్ రాజు, సివిల్ సప్లయిస్ డీఎం రాములు, జిల్లా మార్కెటింగ్ అధికారిశర్మ, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ హాస్టల్ వర్కర్ల నియామకం పై విచారణ జరిపించాలి

నవతెలంగాణ-దేవరకొండ

నల్లగొండ జిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్ వర్కర్ల విషయంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమ శాఖ లో వర్కర్ల నియమాకంలో జరిగిన అవినీతి అక్రమాలపై ఏబీసీడబ్ల్యూఓ కృష్ణ వేణిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ గోపాల్‌రెడ్డి పై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. జరిగిన అవినీతి అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, చేతులు మారినా డబ్బులు ప్రభుత్వానికి రికవరీ చేయాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అర్జున్, తరుణ్, దేవేందర్, అవినాష్, గణేష్, మహేష్, రామాంజనేయులు, అజయ్, సిద్దు, మురళీ తదితరులు పాల్గొన్నారు.



ఏబీసీడబ్ల్యూఓ కృష్ణవేణి ను సస్పెండ్ చేయాలి

మిర్యాలగూడ : నల్గొండ జిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్ వర్కర్ల విషయంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదా నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘం సమావేశంలో మాట్లాడారు. పార్ట్ టైం వర్క్ లో నుండి డబ్బులు తీసుకుని అవినీతికి పాల్పడ్డారని ఏబీసీడబ్ల్యూఓ కృష్ణవేణిని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. జిల్లాలో బీసీ సంక్షేమ హాస్టల్ లో వర్కర్ల సమస్య విపరీతంగా వుందని హాస్టల్ లో విద్యార్థుల సంఖ్య వున్నా దగ్గర వర్కర్లు అవసరం ఉందని చాలా సార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు జగన్, వదూద్, శివ, ముని తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : జిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్ వర్కర్లు విషయంలో జరిగిన అవినీతి అక్రమాల పై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ముస్కు రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ గృహాలలో వర్కర్ల సమస్య విపరీతంగా ఉందన్నారు. హాస్టల్లో విద్యార్థుల సంఖ్య కనుగుణగా వర్కర్లు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. వర్కర్ల విషయంలో అవినీతికి పాల్పడ్డ ఏబిసిడబ్ల్యుఓ కృష్ణవేణి తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, చందు, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ రామలింగేశ్వర స్వామి రథోత్సవం

నవతెలంగాణ-చండూరు

మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి జాతరలో భాగంగా మంగళవారం భక్తుల నడుమ భక్తిశ్రద్ధలతో రథం తాడును ముందుకు లాగుతూ రథోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు నివాళులతో వచ్చి, టెంకాయలు కొట్టి స్వామివారి తీర్థ ప్రసాద స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ గజ్జల కృష్ణారెడ్డి,ఆలయ అర్చకులు కారువంగ నరసింహ శర్మ, తిరుపతయ్య శర్మ, శంకర శర్మ, గిరి ప్రసాద్ శర్మ, హరి ప్రసాద్ శర్మపాలకమండలి సభ్యులు,వివిధ పార్టీల నాయకులు, మహిళ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సాంబశివుడి వర్ధంతి

నవతెలంగాణ-వలిగొండరూరల్

తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కునపురి ఐలయ్య అలియాస్ సాంబశివుడు 13వ వర్ధంతి సందర్భముగా ఆయన స్వగ్రామం మండలంలోని దాసిరెడ్డిగూడెంలో ఆయన స్తూపం వద్ద మంగళవారం ఆయన అభిమానులు, మిత్రులు, బిఆర్ఎస్ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సాంబశివుని ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల వెంకట్ రెడ్డి, పనుమటి మమతా నరేందర్ రెడ్డి, కొమురెల్లి సంజీవ రెడ్డి, దేగల పాండరి, మాద శంకర్, దామోదర్ రెడ్డి, కూనపురి స్వర్ణలత,అయోధ్య, నారి మల్లేశం, కూనపురి శ్రీశైలం, కాసాని వెంకటేశం, దంతూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం ఎకరాకు రూ.25వేలివ్వాలి

- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

నవతెలంగాణ-నేరేడుచర్ల

పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల రూపాయల పెట్టుబడి నష్టపరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు బడుగు లింగయ్యయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం నేరేడుచర్ల మున్సిపాలిటీపరిధిలోని బట్టువానికుంట ప్రాంతంలో గల ఎండిపోయిన వరిపొలాలను ఆయన పరిశీలించారు.స్థానిక రైతు దొండపాటి లచ్చిరెడ్డి తను బోర్ల కింద, బావుల కింద సేద్యం చేస్తున్న ఏడెకరాల భూమిలో సుమారు 5 ఎకరాలు పంట పూర్తిగా ఎండిపోయిందన్నారు.వర్షాలు రాక సాగర్ ఆయకట్టు నీరందక, భూగర్భ జలాలు ఎండిపోయి పంట పూర్తిగా ఎండిపోయిందని ఎంపీకి తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవందరోజుల కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు ఏనాడూ ఇంత నష్టం వాటిల్లలేదన్నారు.కేసీఆర్ రైతుపక్షపాతిగా వ్యవహరించారన్నారు.ప్రస్తుత తరుణంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు లేకపోతే పక్కనే ఉన్న కర్నాటక రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున 10 టీఎంసీలు 20 టీఎంసీలు నీటిని తీసుకువచ్చి ఆయా ప్రాజెక్టు కింద ఉన్న సాగు



తాగునీటి అవసరాలు తీర్చాలన్నారు. నల్గొండ, సూర్యాపేట జిల్లాల రైతులకు నీరందించకుండా ఖమ్మం జిల్లాలో తిరుమలాయపాలెం వరకు నీటిని తరలించారని, ఇక్కడి ప్రాంతా రైతులు ఏం పాపం చేశారని తెలిపారు.రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల తరపున పోరాటాలు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ చందమల్ల జయబాబు, మాజీ మార్కెట్ చైర్మెన్ నాగేంద్ర శ్రీధర్, నేరేడుచర్ల పీఏసీఎస్ చైర్మెన్ దొండపాటి అప్పిరెడ్డి, పెంచికలదిన్న ఎంపీటీసీ ఎల్లబోయిన లింగయ్య కడియం వెంకట్‌రెడ్డి, పల్లెపంగ నాగరాజు, పసుపులేటినర్సింహారావు ఎల్ నాగార్జున, ఇనుపాల పిచ్చిరెడ్డి, బొడ్డుపల్లి సుందరయ్య, జెట్టి వెంకన్న, చిట్యాల శ్రీను, భరత్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వంశరాజ్ భవన నిర్మాణానికి సహకరించాలి

- ఎమ్మెల్యే వీరేశంను కలిసిన వంశరాజ్ నూతన కార్యవర్గం

నవతెలంగాణ-రామన్నపేట

వంశరాజ్ భవన నిర్మాణానికి సహకరించాలంటూ ఎమ్మెల్యే వేముల వీరేశంను నియోజకవర్గ కేంద్రంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో వంశరాజ్ నూతన కార్యవర్గం మంగళవారం కలిసింది. ఈ సందర్భంగా వంశ రాజ్ సంఘం నూతన భవన నిర్మాణానికి స్థలాన్ని, నిధులను ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పూస బాలకిషన్, మిర్యాల వెంకన్న, నూతన కార్యవర్గం, సంఘ నాయకులు పాల్గొన్నారు. మండల వంశరాజ్ సంఘం నూతన అధ్యక్షులుగా శ్యామల సత్తయ్య వంశరాజ్, ఉపాధ్యక్షులు బండారి



దుర్గయ్య ప్రధాన కార్యదర్శి ఒంటెద్దు రమేష్, జాయింట్ సెక్రెటరీ చిందం భిక్షం, కోశాధికారి శ్యామల నాగరాజ్, నాయకులు, ఒంటెద్దు ఆనంద్ వంశరాజ్, శ్యామల గణేష్ వంశరాజ్, చిందం యాదగిరి వంశరాజ్, శ్యామల మహేష్ వంశరాజ్, శ్యామల బుచ్చయ్య వంశరాజ్, ఒంటెద్దు బక్కయ్య వంశరాజ్, మంగయ్య, నరసింహ, మారయ్య, బాలకృష్ణ, శ్రీకాంత్, సత్తయ్య, బాల మల్లేష్, ఎన్నికయ్యారు.

చక్రయ్య చిత్రపటానికి నివాళులు

నవతెలంగాణ-నకిరేకల్

మండలంలోని నోముల గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు వ్యాస మహేశ్వర్ రెడ్డి మామ చక్రయ దశదినకర్మను పురస్కరించుకొని మంగళవారం ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సామ రవీందర్ రెడ్డి, సామ సురేందర్ రెడ్డి, గొలుసు లింగయ్య యాదవ్, శీను, చనగొని రాజశేఖర్ గౌడ్, నల్గొండ మహేష్, వంటేపాక గిరి, పందిరి సతీష్ పాల్గొన్నారు.

టెట్ అర్హత పరీక్ష ఫీజు తగ్గించాలని వినతి



నవతెలంగాణ-మిర్యాలగూడ

టెట్ అర్హత ఫీజు తగ్గించాలని కోరుతూ టెట్ కన్వీనర్ రాధా రెడ్డికి మంగళవారం వినతి పత్రం సమర్పించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ గతంలో టెట్ ఒక పేపర్‌కు రూ. 200 ఫీజు ఉండగా దాన్ని రూ. 1000కి పెంచారని,.రెండు పేపర్లు రాసే అభ్యర్థులకు గతంలో రూ.300గా ఉన్న ఫీజును ఏకంగా రూ.2,000కు వరకు పెంచారని ఫీజులను ఈ స్థాయిలో పెంచడం నిరుద్యోగులకు అన్యాయం చేసినట్టేనని అన్నారు. ఇప్పటికే కోచింగ్, శిక్షణ,హాస్టల్ ఫీజులకే వేలకు వేల రూపాయలు ఖర్చుపెడుతున్న అభ్యర్థులకు ఇది భారం కానుందని అన్నారు.దేశంలో ఎక్కడ లేని విధంగా టెట్‌కి ఒక్కో పేపర్‌కి వెయ్యి రూపాయల ఫీజు చెల్లించాలి అనడం మూర్ఖత్వమేనని అన్నారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయమని చెప్పి ఇప్పుడు మాట మార్చడం సరికాదన్నారు.ఆన్ లైన్ పరీక్ష పేరిట వేలకు వేల రూపాయలు వసూలు చేయటం సరికాదని, వెంటనే టెట్ ఫీజు తగ్గించాలి.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు రవి, కిరణ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర నాయకులు గుంటి మహేష్ పాల్గొన్నారు.

టెట్‌పరీక్షా ఫీజు పెంపు నిరుద్యోగులపై భారం

చండూరు : టెట్ పరీక్ష ఫీజు అధికంగా పెంచడం వల్ల నిరుద్యోగులపై పెను భారం పడుతుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేష్ అన్నారు. మంగళారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఒక పేపర్ రాస్తే 200 , 2 పేపర్లు రాస్తే 300 ఫీజు ఉండేది కానీ ఇప్పుడు ఒక పేపర్ కి 1000 రూపాయలు రెండు పేపర్లు రాస్తే 2000 రూపాయల ఫీజు పెట్టడం సరికాదని, రేపటి నుంచి టెట్ పరీక్ష ఫీజు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో పాత ఫీజునే తీసుకోవాలని కోరారు.

ఎక్సైజ్ దాడులు పలువురిపై కేసులు నమోదు

నవతెలంగాణ-హుజూర్‌నగర్



నియోజకవర్గ పరిధిలోని ఎక్సైజ్ సిబ్బంది మంగళవారం మేళ్లచెరువు, చింతలపాలెం, మఠంపల్లి మండలాల్లో దాడులు నిర్వహి ంచారు. ఈ దాడుల్లో ద్విచక్ర వాప ాానం నాటుసారా స్వాధీనం చేసుకొని పలువురుపై కేసు నమోదు చేశామని ఎస్సైలు జగన్మోహన్‌రెడ్డి, దివ్యలు తెలిపారు. చింతలపాలెం మండలంలో ఎర్రగుంటతండాకు చెందిన ఆంగోత్ గోపి, పద్య ప్రసాద్ రఘునాథపాలెంకు సారా తరలిస్తుండగా సారా పట్టుకుని బండిని సీజ్ చేశామన్నారు. ఎర్రగుంట తండాకు చెందిన రమేష్ ఇంట్లో ఐదు లీటర్ల సారా 200 కేజీల నల్లబెల్లం, ఎనిమిది వందల లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామన్నారు. దాడుల్లో సిబ్బంది నాగరాజు, రుక్మారెడ్డి, నరేష్, ధనుంజయనాయుడు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో గన్ని బ్యాగులు దగ్ధం

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

మండల పరిధిలోని జూలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో 7000 గన్ని బ్యాగులు దగ్ధమైన ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం జూలూ రులోని రైతు వేదిక పక్కన ఉన్న ధాన్యం మార్కెట్లోని షెడ్డులో గత సంవత్సరానికి చెందిన గన్ని బ్యాగులు నిన్న సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరగడంతో సగానికి పైగా కాలిపోయాయి. ఊరి చివరన ఉండడంతో ఎవరు గమనించలేకపోయారు. అటుగా వెళుతున్న వ్యక్తి పొగ కమ్ముకోవడంతో మార్కెట్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా అటు వెళ్లి చూసేసరికి సగానికి పైగా కాలిపోయి ఉన్నట్లు గమనించి గ్రామ పంచాయతీ నీటి ట్యాంకర్‌తో మంటలపడానికి ప్రయత్నించగా అప్పటికే పూర్తిగా కాలిపోయాయని తెలిపారు. సుమారు వీటి విలువ 3 లక్షల రూపాయలుపైగా ఉంటుందని చెప్పారు.

సర్టిఫికెట్స్ అందజేత

నవతెలంగాణ-నాంపల్లి

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 1000 మందికి పైగా మహిళలకు రెండు నెలలుగా మదర్ ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి మంగళవారం ఆ సొసైటీ చైర్మన్ బొజ్జ సంధ్య రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మెన్ కోమటిరెడ్డి లక్ష్మి రాజ్ గోపాల్ రెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి లక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల మహిళల అవసరాలను గుర్తించి వారికి ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి మార్గాలను కల్పిస్తున్న సొసైటీ చైర్మెన్ సంధ్య రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి జెడ్పిటిసి ఎలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, నాంపల్లి మాజీ సర్పంచ్ పెరుమాండ్ల శైలజ శ్యాంసుందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఏరెడ్ల రఘుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి, మహిళా మండల అధ్యక్షురాలు ఎస్.కె అఫ్రాభి చాంద్ పాషా పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు 28న స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

గ్రూప్ 1,2,3,4 బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, రాష్ట్ర స్థాయి, కేంద్ర స్థాయి ఉద్యోగాల కోసం ఫౌండేషన్ కోర్సు ద్వారా మూడు నెలల పాటు ఉచిత వసతి, శిక్షణ అందించేందుకు ఈనెల 28న (ఎస్సి అభ్యర్థులు మాత్రమే) స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి ఎల్. శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. పట్టణంలోని విశ్వదీప్ విద్యాపీఠ్ హై స్కూల్ లో స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నామని, అభ్యర్థులకు డిగ్రీ లో వచ్చిన మార్కుల, మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. సెలెక్ట్ అయిన అభ్యర్థులకు రెసిడెన్షియల్ తో కూడిన శిక్షణ ఉంటుందని తెలిపారు.ఇతర వివరాలకు 8465035932 , 9010895239. సంప్రదించాలని తెలిపారు.

రెండు రోజుల జాతీయ సదస్సును జయప్రదం చేయండి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

నాగార్జున ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో నేడు, రేపు రెండు రోజులు తెలుగు నాటక సాహిత్యం-సమాలోచన అను అంశంపై జాతీయ సదస్సు నిర్వహించబడుతుందని ఆ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సముద్రాల ఉపేందర్ తెలిపారు. మంగళవారం ఎన్జీ కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు ఉదయం ప్రారంభ సమావేశానికి మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ సిహెచ్. గోపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా, కళాశాల విద్య కమిషనరేట్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి. యాదగిరి, అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ బాల భాస్కర్, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ ఎం. పురుషోత్తమాచార్య, ఆయా విశ్వవిద్యాలయాల తెలుగు శాఖ అధిపతులు హాజరుకానున్నట్టు తెలిపారు.. అనంతరం తెలుగు శాఖ అధ్యక్షులు తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ ఉభయ రాష్ట్రాల నుండి సుమారు 75 మంది ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు నాటక సాహిత్యానికి సంబంధించిన ఆయా అంశాలపై పత్ర సమర్పణ చేయడానికి వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ ఎన్. దీపిక, ఎస్.లవేందర్ రెడ్డి,డాక్టర్ వెల్దండి శ్రీధర్, డాక్టర్ టి. సైదులు, జి. గోవర్ధనగిరి, ఎస్. ప్రభాకర్, ఎం. లింగస్వామి, బి. రమ్య, డి. అంజయ్య, గ్రంథ పాలకులు డాక్టర్ ఎ. దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

నవతెలంగాణ-అర్వపల్లి

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ పశుసంవర్ధకులు ముందస్తు జాగ్రత్తగా టీకాలను వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు డాక్టర్ రవి ప్రసాద్,డాక్టర్ కుమారస్వామి అన్నారు.మండలంలోని తిమ్మాపురం, కోడూరు గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణాటీకాలేసే కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున పశు వులను ఎండల నుండి కాపాడుకోవాలన్నారు.పరిశుభ్రమైన నీటిని తాగించాలని, మేత అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అర్జున్, వీఎల్ఓ పద్మ, గోపాలమిత్ర సురేందర్, వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.



గీత కార్మికునికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-ఆత్మకూర్ఎస్

మండలపరిధిలోని గట్టికల్లు గ్రామంలో తాటిచెట్టు పైనుండి కిందపడి సోమవారం రాత్రి గీత కార్మికుడు కోన నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం స్థానికులు సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు.

ప్రజల మనిషి ధర్మబిక్షం అందరికీ ఆదర్శప్రాయుడు

- సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

నవతెలంగాణ-నల్లగొండటౌన్

ప్రజల మనిషిగా సామాన్య జీవితం గడిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడుబొమ్మగాని ధర్మ భిక్షం అందరికీ ఆదర్శ ప్రాయుడని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. అమరజీవి బొమ్మగాని ధర్మ భిక్షం13వ వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రజలను చైతన్యం చేసి దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రావణ్ కుమార్,గీత పనివారాల సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు , సుంకరి మల్లేశం గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పబ్బు వీరాస్వామి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజా రామచంద్రం,మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ గిరి రామ, ఖమ్మంపాటి వెంకన్న, నాయకులు విశ్వనాధుల లెనిన్,జిల్లా యాదయ్య,ఎస్ కెమదర్,యూసుఫ్,దోటి పండరి కౌసల్యసుజాత ,తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ : , నిత్యం పేద ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడిన మాజీ ఎంపీ ధర్మబిక్షం త్యాగాలు సేవలు యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా పర్వత రెడ్డి సూచించారు . మంగళవారం ధర్మ బిక్షం 13వ వర్ధంతి సందర్భంగా స్థానిక పల్లా పర్వత్‌రెడ్డి భవన్లో చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, మండల కార్యదర్శులు ఉప్పునూతల వెంకటయ్య, కుంభం జయరాములు, నూనె రామస్వామి, పల్లా రంగారెడ్డి,వలమల్ల ఆంజనేయులు,కిన్నెర యాదయ్య, గంగిడి రాంరెడ్డి, జూలూరి వెంకట్రాములు, నూనె వెంకటేశ్వర్లు, ఎండి మైనద్దీన్, నాగవరంవెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గౌడ గీతా సంఘంల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని తాటి కోల్ గ్రామంలో ధర్మ భిక్షం వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ జిల్లా చైర్మన్ డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్, చలమల విజయ్ గౌడ్, పల్స కాటన్ గౌడు, జూలూరు రేణు గౌడ్ ,లాలయ్య గౌడ్, వీరయ్య గౌడ్ ,ఆంజనేయులు గౌడ్, బాలచందర్ గౌడ్ పాల్గొన్నారు.

చిట్యాల టౌన్ : మాజీ ఎంపీ బొమ్మ గోని ధర్మభిక్షం విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని గీతా



నల్లగొండటౌన్....

పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని కనకదుర్గ సెంటర్లో ధర్మ బిక్షం వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎండి.అక్బర్, నాయకులు బొలుగురి లింగయ్య, ఎస్కే షరీఫ్,మేకల బిక్షం,తదితరులు పాల్గొన్నారు.

చండూరు :మాజీ ఎంపీ ధర్మబిక్షం వర్ధంతి సందర్భంగా మండలకేంద్రంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గీతా పనివార్ల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకరయ్య గౌడ్, ఆ పార్టీ మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు రమేష్, గంటా నగేష్, పరమేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
బుధవారం | మార్చి 27. 2024 | www.navatelangana.com

చెరువుగట్టు ఆలయ హుండీ లెక్కింపు

- ఆదాయం రూ.21,92,075

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మండల పరిధిలోని చెరువుగట్టులోగల శ్రీ పార్వతీజడలరామలింగేశ్వర స్వామి దేవస్థానము,లో మంగళవారంభక్తులు సమర్పించిన కానుకల హుండీని గట్టుకింద అమ్మవారి ఆలయ హుండీలు, గట్టుపైన శ్రీ స్వామివారి ఆలయహుండీలను లెక్కించారు. గట్టుకింద అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం రూ.3,08,390లు, గట్టుపైన స్వామివారి ఆలయ హుండీ ఆదాయం రూ. 18,83,685 లు మొత్తం 26 రోజులకు గాను రూ.21,92,075లు వచ్చినట్లు దేవస్థాన కార్యనిర్వహ ణాధికారి ఎస్ నవీన్ తెలిపారు. అదేవిధంగా అన్నదానం హుండీ ఆదాయంరూ.36,580 వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ నల్లగొండ డివిజన్ పరిశీలకురాలు ఎమ్. వెంకటలక్ష్మి, నందిగామ శ్రీ దుర్గ శివసాయి సేవా సమితి సభ్యులు, ఐడిబిఐ మాదఎడవల్లి బ్రాంచి సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

చినముత్తమ్మ దశదిన కర్మలో ఎమ్మెల్యే వేముల వీరేశం

నవతెలంగాణ-చిట్యాలటౌన్

మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ జనార్ధన్ అమ్మమ్మ జనపాల చినముత్తమ్మ (80) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది.మంగళవారం జరిగిన దశదినకర్మ కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని చినముత్తమ్మ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ్మా, జిల్లా నాయకులు కోనేటి యాదగిరి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకు సైదులు, బోడ్డు శ్రీను, పందుల గోపాల్, కురుపటి లింగయ్య, మేడబోయిన శ్రీనివాస్, గంగాపురం వెంకన్న, గుత్తా రవీందర్ రెడ్డి, మేడి మణెమ్మ ,గంగాపురం భూపాల్, లక్ష్మణ్ లింగస్వామి, యాదయ్య పాల్గొన్నారు.

భువనగిరి సీటుపై కాంగ్రెస్ మల్లగుల్లాలు

- బీఆర్ఎస్, సీపీఐ(ఎం), బీజేపీ నుండి బీసీ అభ్యర్థులు
- బీసీలకే ఇవ్వాలని కాంగ్రెస్ క్యాడర్, బీసీ సంఘాల డిమాండ్
- బీసీ అభ్యర్థి దిశగా అధిష్టానం ఆలోచన
- నేడు ఏఐసీసీ సమావేశంలో అభ్యర్థి ప్రకటన..?

నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి పార్లమెంటు స్థానానికి బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ(ఎం) ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి ప్రచారానికి రంగం సిద్ధం చేసుకుంటుంటే కాంగ్రెస్ మాత్రం ఇంకా అభ్యర్థిని ఎంపిక చేసేందుకు మల్లగుల్లాలు పడుతోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో మంచి జోష్‌లో ఉంది కాంగ్రెస్ క్యాడర్. దీనికి తోడు ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారెంటీలను అమలు చేస్తున్న తీరుపై ప్రజల్లోనూ ఓ సానుకూల దృక్పథం ఉండటంతో ఆ పార్టీకి తిరిగి అదే జోష్‌లో ఫలితాలుకూడా పునరావృతం అయ్యే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకత్వం కూడా భావిస్తుంది. దీని కారణంగానే కాంగ్రెస్ పార్టీలో ఈ సీటుపై తీవ్రమైన పోటీ నెలకొంది. ఈ క్రమంలోనే ఈ స్థానంలో సామాజిక సమీకరణలు, స్థానిక నేతల అభిప్రాయాలు, అభ్యర్థుల ఆర్థిక పరిస్థితి, సర్వేలు తదితర అంశాలను ఆసరా చేసుకుని బుధవారం జరిగే ఏఐసీసీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశంలో అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉందని చర్చజరుగుతోంది.

భువనగిరి పార్లమెంట్ స్థానంలో ఇప్పటికే బీజేపీ మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌ను, బీఆర్ఎస్ శ్యామ మల్లేష్‌ను, సీపీఐ(ఎం) ఎండీ. జహంగీర్‌ను అభ్యర్థులుగా ప్రకటించింది. మూడు పార్టీలు సామాజిక సమీకరణల్లో భాగంగా బీసీ అభ్యర్థులను ప్రకటించాయి. మూడు పార్టీల అభ్యర్థులు బీసీ సమాజికవర్గానికి చెందిన వారు కావడంతో కాంగ్రెస్ పార్టీ కూడా బీసీ అభ్యర్థినే ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ మేజర్ క్యాడర్ సహా, బీసీ సంఘాల నాయకులు కూడా నియోజకవర్గం వ్యాప్తంగా డిమాండ్ చేస్తున్నారు. బీసీ అభ్యర్థిని ప్రకటించడంలో జాప్యంపై ఆయా వర్గాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. తెలంగాణలో ప్రజాపాలన జరుగుతుందని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు ఎంపీ స్థానం కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆయా సంఘాలు విమర్శిస్తున్నాయి. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు ఎన్నికలకు ముందు న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి బీసీలకు టికెట్ కేటాయించే విషయంలో మాత్రం తీరని అన్యాయం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బీసీల జనాభానే అధికంగా ఉన్నదనీ, బహుజన కులాలకు తప్ప వేరే కులాలకు టికెట్ ఇస్తే కాంగ్రెస్ తన ఓటమి తానే కొనితెచ్చుకున్నట్లు అవుతుందని ఆ సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ ఓడిపోతే ఆ బాధ్యత టికెట్ ఇచ్చిన వారిదే నని, అందుకే టికెట్ ఇచ్చేముందు ఆలోచించాలని కోరుతున్నారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాత్రం బీఆర్ఎస్ భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డిని కాంగ్రెస్ లోకి తీసుకొచ్చి టికెట్ ఇప్పించాలని ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఆ సందర్భంలో సొంత తమ్ముడు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన భార్య లక్ష్మి పోటీచేయరనీ, బీసీలకే టికెట్ కేటాయించాలని కోరడంతో బీసీ నినాదానికి మరింత ఊతం ఇచ్చింది. రెడ్డి సామాజిక వర్గానికి, బీసీ సామాజిక వర్గానికి టికెట్లు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర రాజధానితో పాటు, దేశ రాజధాని ఢిల్లీ వరకు నాయకులు తమ ప్రయత్నాలు చేస్తున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన నార్కట్‌పల్లి వాసి,ఎన్ఆర్ఐ చల్లా తేజ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం మొత్తం ఇప్పటికే పెద్ద ఎత్తున వాల్ పోస్టర్లను వేయించారు. తన సేవా కార్యక్రమాలతో ఇప్పటికే నియోజకవర్గం మొత్తం తన ప్రాభల్యాన్ని పెంచుకున్నారు. ఢిల్లీ పెద్దల ఆశీస్సులు కూడా ఉండడంతో తేజకే టికెట్ దక్కనున్నట్లు ఆయన అనుచరులు గట్టిగా చెబుతున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మధుయాష్కి హైదరాబాద్ ఎల్బీనగర్ స్థానం నుండి పోటీ చేసి ఓడిపోవడంతో తిరిగి భువనగిరి పార్లమెంట్ స్థానాన్ని ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న కూడా సీటుకోసం ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా కాంగ్రెస్ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- కలెక్టర్లకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచన

నవతెలంగాణ-భువనగిరి



రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, పట్టణ గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లకు సూచించారు. మంగళవారం ఆమె రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోళ్లను, త్రాగునీటి ఇబ్బందులు కలుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షిస్తూ వచ్చే ఏప్రిల్ ఒకటవ తేదీన ప్రతి మండలంలో ఒక కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని, మిగతా కొనుగోలు కేంద్రాలను సత్వరమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు టెంట్ సౌకర్యం, త్రాగునీరు తదితర సౌకర్యాలు ఉండాలన్నారు. కొనుగోళ్ల కేంద్రాలకు ఇన్చార్జీ అధికారుల పర్యవేక్షణతో రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు నిర్వహించాలని సూచించారు. అంతరాష్ట్ర చెక్ పోస్టుల వద్ద నిఘా ఉంచాలని, ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే జిల్లాలకు కేటాయించిన సిఎంఆర్ లక్ష్యాలను సకాలంలో సాధించాలని సూచించారు.

అనంతరం త్రాగునీటిపై సమీక్షిస్తూ.. వేసవి కాలంలో త్రాగునీటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ త్రాగునీటి సరఫరాలో వచ్చే చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. మరమ్మతులను వెంటనే పునరుద్ధరించాలన్నారు. క్షేత్రస్థాయిలో మున్సిపల్ ఇంజనీర్లు, ఆర్.డబ్ల్యూ.ఎస్. ఇంజనీర్లు సమన్వయంతో త్రాగునీటి సక్రమ సరఫరా చేయాలని, నీటి లభ్యత, సరఫరాల పట్ల పూర్తి అవగాహన కలిగివుండాలని, సమస్యలు ఏర్పడే ప్రాంతాలను గుర్తించాలని, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరాకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, గ్రామ, మండల స్థాయి అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణతో త్రాగునీటి సమస్యను అధిగమించాలని సూచించారు.

జిల్లా కలెక్టరు హనుమంతు కే.జెండగే వివరణ..

జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రానున్నదని, 323 కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో 720 ఆవాసాలు ఉన్నాయని, అర్బన్, గ్రామాలలో పనిచేయని బోర్లను గుర్తించి మరమ్మత్తు పనులు చేపట్టడం జరిగిందన్నారు. త్రాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లతో పర్యవేక్షిస్తున్నామని పూర్తి కార్యాచరణ ప్రణాళికతో సమీక్షించుకోవడం జరుగుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు గంగాధర్, జిల్లా సరఫరాల అధికారి శ్రీనివాసరెడ్డి, సివిల్ సప్లయ్ డిఎం గోపీకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, మిషన్ భగీరథ డిఈ. కరుణాకర్ మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి

- కలెక్టర్ హరిచందన దాసరి



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

లోకసభ ఎన్నికల నిర్వహణ లో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన తెలిపారు. మంగళవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తన గదిలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. నల్గొండ జిల్లాలోని జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు(పీ.ఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏ.పీ.ఓ)లను, ఇతర పోలింగ్ అధికారులు (ఓ.పీ.ఓ)ల ర్యాండమైజేషన్ నిర్వహించారు. రిజర్వ్ సిబ్బందిని కలుపుకుని జిల్లా పరిధిలోని మొత్తం 9490 మంది పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ జరిపారు. వీరిలో 2368 పీ.ఓలు, 2377 మంది, ఏపీఓ లు, 4745 మంది ఓపీఓలు ఉన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్ చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పోలింగ్ విధుల కు నియమించబడిన సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియకు రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,జిల్లా ఇన్ఫర్మేటిక్ అధికారి గణపతి రావు, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డిఆర్డిఏ నాగిరెడ్డి, డీఈఓ బిక్షపతి తదితరులు హాజరయ్యారు.

దొరికిన డబ్బును పోలీసులకు అప్పజెప్పిన యువకుడు

నవతెలంగాణ-రామన్నపేట



మండల కేంద్రాల్లోని కెనరా బ్యాంకుకు సంబంధించిన ఏటీఎంలో మంగళవారం మండలంలోని నీర్నేముల గ్రామానికి చెందిన కట్ట కుమార్ డబ్బులు డ్రా చేయడానికి వెళ్లి అక్కడ రూ.9 వేలు మర్చిపోయి వెళ్లిపోయారు. అనంతరం మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన ఆవనగంటి మహేష్ అదే ఏటీఎంలో డబ్బులు డ్రా చేయడానికి వెళ్లగా అక్కడ తొమ్మిది వేల రూపాయలు ఉండడం చూసి వాటిని తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై పి మల్లయ్యకు అప్పగించారు. డబ్బులు మర్చిపోయిన కుమార్ కొద్దిసేపట్లోనే ఏటీఎంకు వెళ్లి చూడగా డబ్బులు కనిపించలేదు. కెనరా బ్యాంకు మేనేజర్‌కు విషయం తెలియజేశారు. సీసీ కెమెరాలు పరిశీలించిన మేనేజర్ తర్వాత డబ్బులు డ్రా చేసిన మహేష్ వివరాలను కుమార్‌కు తెలియజేశారు. కుమార్ మహేష్‌కు ఫోన్ చేసి అడగగా డబ్బులను పోలీస్ స్టేషన్ లో అప్పగించానని తెలియజేశారు. కుమార్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై మల్లయ్య ద్వారా డబ్బులను తీసుకొని మహేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నిజాయితీ చాటుకున్న మహేష్‌ను ఎస్ఐ మల్లయ్యతో పాటు స్థానిక వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, పులిబిక్షం, అప్పం సురేందర్, పోలీస్ అధికారులు అభినందించారు.



బొమ్మగాని ధర్మ బిక్షం 13వ వర్ధంతి

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని గౌడ సంఘం కార్యాలయంలో గౌడసంఘం ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ సాయుధ పోరాటయోధులు, కల్లుగీత కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన బొమ్మగాని ధర్మబిక్షం 13వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గౌడ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గౌడసంఘం అధ్యక్షులు చింతకింది అంజయ్యగౌడ్, ప్రధానకార్యదర్శి తొర్పునూరి వెంకటేశ్‌గౌడ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మాజీ అధ్యక్షులు బత్తుల లక్ష్మయ్యగౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బత్తుల శ్రీశైలం, నాయకులు ఉడుగు మల్లేశ్‌గౌడ్, బొడిగె బాలకృష్ణగౌడ్, కాసుల వెంకటేశ్, మునుకుట్ల జంగయ్య, ఉష్కాగుల నాగరాజు, పాలకుర్ల స్వామి, చెరుకు శివగౌడ్, సత్యనారాయణ, వర్కాల రవి పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో.. చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ మండలకార్యదర్శి పల్లె శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్మబిక్షం 13వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పగిళ్ల మోహన్‌రెడ్డి, ఉడుత రామలింగం, కొండూరు వెంకటేశం, బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు, బిక్షపతి, నర్సింహా, యాదయ్య, కృష్ణ పాల్గొన్నారు.

రామన్నపేట: గీతాపనివారుల సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బొమ్మగాని ధర్మ బిక్షం వర్ధంతిని మండల కేంద్రంలో సిపిఐ మండల



కార్యదర్శి ఊట్కూరు నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా నాయకులు మల్లయ్య, మండల నాయకులు గంగాపురం వెంకటయ్య, సీనియర్ నాయకులు వీరమల్ల వెంకటయ్య, బావండ్ల పల్లి బాలరాజు, ముత్తయ్య, సంఘం నాయకులు లగ్గోని యాదయ్య, గంగాపురం యాదయ్య, భూపతి నరసింహ, చెరుకు శివరాజ్, కూనూరు సుధాకర్, విరమళ్ళ లక్ష్మీనారాయణ, కూనూరు నరసింహ, నోముల వెంకటేష్, గంగాపురం యాదగిరి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలేరుటౌన్: బొమ్మగాని ధర్మపురి వర్ధంతిని ఆలేరు పట్టణంలో సిపిఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, మండల, పట్టణ కార్యదర్శులు చౌడబోయిన కనకయ్య, గొట్టిపాముల శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

మండల ఉపాధ్యక్ష ఎన్నిక వాయిదా

- కోరం లేకపోవడంతో ఎన్నిక వాయిదా వేసిన ఆర్డీఓ
- రేపు ఎన్నిక నిర్వహిస్తామని తెలిపిన ఆర్డీఓ
- వైస్ఎంపీపీ కోసం పోటీపడుతున్న ముగ్గురు ఎంపీటీసీలు..?
- నేడు వైస్ఎంపీపీ ఎన్నిక

నవతెలంగాణ-కోదాడరూరల్



మండల వైస్ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. మంగళవారం పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాటు చేశారు.ఎన్నికకు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఆర్డీవో సూర్యనా రాయణ వ్యవహరించారు.ఉదయం 11:30 నిమిషాల వరకు ఎంపీటీసీలు ఎవరు రాకపోవడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వాయిదా వేశారు.ఇదిలా ఉండగా వైస్ఎంపీపీ పదవ కోసం ముగ్గురు పోటీపడుతున్నట్లు సమాచారం. వీరిలో తొగర్రాయి ఎంపీటీసీ లిక్కి గురవమ్మ, చిమిర్యాల ఎంపీటీసీ కలకొండ సౌజన్య, నల్లబండగూడెం ఎంపీటీసీ యరమాల క్రాంతి పోటి పడుతున్నట్లు తెలుస్తుంది.మండలపరిధిలో ప్రస్తుతం 9 మంది ఎంపీటీసీలు ఉన్నారు.వీరిలో ముగ్గురు వైస్ఎంపీపీ పదవి కోసం పోటీపడుతున్నారు.పదవి తమదంటే తాము అంటూ ఎవరికి వారు అంచనా వేసుకుంటున్నారు.ఆ ముగ్గురిలో ఇద్దరు టీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి రావాలి అనుకునే వాళ్ళు.వారు ఎంపీపీ ఎన్నికలో కీలకపాత్ర పోషించారు. కాగా ఆ ఇద్దరిలో ఎవరికి అయినా వైస్ ఎంపీపీ పదవి ఇస్తారెమో అని ఆశతో ఉన్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. అంతేకాకుండా ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీలో ఇరువురిని చేర్చుకోలేదని ఒకంత అసహనంగా ఉన్నట్లు సమాచారం.కానీ ఎంపీపీ ఎన్నిక ప్రశాంతంగా ముగిసినా, వైస్ఎంపీపీ ఎన్నిక మాత్రం కాంగ్రెస్‌కు కొంచెం తలనొప్పిగానే మారింది. కాగా ఎన్నికల అధికారి నేడు వైస్ఎంపీపీ ఎన్నిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామని తెలిపారు.

'కార్మికులకు అండ సీఐటీయూ జెండా'

నవతెలంగాణ-కోదాడరూరల్



కార్మికులకు అండ సీఐటీయూ జెండాను అని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ముత్యాలు అన్నారు.మంగళవారం పట్టణంలోని కూరగాయల మార్కెట్ హమాలి కార్మికుల నూతన వేతనఒప్పందం అగ్రిమెంటు గడువు ముగిసి వారం రోజులైనా నేటికీ యాజమాన్యం చర్చలకు రాకపోవడంతో విధులు బహిష్కరించారు.సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన మెరుపుసమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు.దేశంలో రాష్ట్రంలో నిత్యావసర సరుకులు ధరలు రోజురోజుకు పెరుగుతున్న హమాలీ కార్మికుల రోజువారి కూలీ పెరగడం లేదని వారన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగేటువంటి అగ్రిమెంటు రేట్ల ప్రకారమే కార్మికులను కూలి రేట్లు తీసుకుంటున్నారని,అదనంగా యాజమాన్యం ఒక్క రూపాయి కూడా చెల్లించదన్నారు.ఈ పరిస్థితులలో కార్మికులు అగ్రిమెంట్ చేయమని యాజమాన్యం అడిగినందుకు ఎంతసేపటికి స్పందించకపోవడంతో ఎగుమతి, దిగుమతి చేసే కూరగాయల లారీల లోడ్లను ఆపేసి సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు.ఉదయం 6 గంటల నుండి పది గంటల వరకు ఏ ఒక్కర్ని మార్కెట్లోకి రానివ్వకుండా అడ్డుకొని సమ్మె చేశామన్నారు. అనంతరం కొంతమంది యాజమాన్యం జోక్యం చేసుకొని రెండు మూడు రోజుల్లో మీ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించామన్నారు.ఈ కార్యక్రమంలో ఏసోబు, శ్రీనివాస్,కొండలు, శరభందరెడ్డి, వెంకన్న, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ మున్సిపాలిటీలో నీటి సమస్య పరిష్కరించాలి

నవతెలంగాణ- దేవరకొండ

మున్సిపాలిటీలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని మంగళవారం బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేశారు. పట్టణంలోని కొన్ని వార్డులలో నీటి సమస్య ఉన్నట్లు ఆయా కాలనీ ప్రజలు బీసీ సంక్షేమ సంఘం దృష్టికి తీసుకొచ్చారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మున్సిపాలిటీ సరఫరా చేసే తాగునీరు వారానికి ఒకసారి రావడం వల్ల నీటి సమస్య తీవ్రంగా నెలకొందన్నారు. వేసవి కాలం కావడంతో బోర్లు అడుగంటి పోయాయని నీళ్ల లేక కనీస అవసరాలు వాడుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ స్పందించి వార్డులలో రోజువారి నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి చోల్లేటి భాస్కరాచారి, ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షుడు రాచమల్ల నాగయ్య ముదిరాజ్, గెలమోని యాదయ్య, పున్న శ్రీనివాస్, ఆలంపల్లి శ్రీనివాసులు, అబ్దుల్ కలాం, కోప్పెర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

ఉమ్మడి జిల్లాలోని(సూర్యాపేట,నల్లగొండ) తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6 నుండి 9 వ తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్సీఓ అరుణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. www.tswreis.ac.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21 న ఉదయం11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రవేశ పరిక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు.